
సహజీవన భావనల పావురాయి

# పావురాయి

వారపత్రిక 17-7-2026 ₹ 15/-








పచ్చని సంతకం చేద్దాం



# గీటురాయి
సహజీవన భావనల సారథిరాయి
వారపత్రిక

## GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 48 సంచిక: 29 హైదరాబాద్
శుక్రవారం 17 జూలై 2026 రూ.15-00
సఫర్ 2 1448 హిజ్రీ


**తొలిగీటు**

సదఖా (దానం) అల్లాహ్ ఆగ్రహాన్ని చల్లారుస్తుంది. నీచమైన చావు నుంచి రక్షిస్తుంది.

*(జామె తిర్మిజీ)*


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at “Geeturai Graphics”, Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


కథ


30

**ఒక ఖాళీ మంచం... ఒక నిశ్శబ్ద బోధన**

## లోపల...


| | | |
|---|---|---|
| విద్య | ...... | 04 |
| మళ్ళీ యుద్ధం | ...... | 05 |
| ఆశల ఉషోదయానికి అక్షరాల తోరణం | ...... | 08 |
| ప్రస్తుత సామాజిక సంక్షోభం – ముస్లిముల బాధ్యత | ...... | 11 |
| భారత ప్రధానులు! | ...... | 12 |
| అక్షరమే వెలుగు... విద్యే పరమార్థం! | ...... | 14 |
| నోటిఫికేషన్ల నడుమ... నిశ్శబ్ద పతనం! | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| భారత దేశంలో సమకాలీన సామాజిక సమస్యలు-ఇస్లామ్ పరిష్కారం | ...... | 20 |
| మానసిక ప్రశాంతతను దెబ్బతీసే ఆందోళన | ...... | 24 |
| సిగ్గే బంగారం | ...... | 25 |
| పచ్చని సంతకం చేద్దాం | ...... | 26 |
| ఇసుక గీతలు... రాతి చెక్కడాలు! | ...... | 28 |
| కాలం చెరగని న్యాయ సూత్రం | ...... | 29 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| నమాజ్ – జీవన క్రమశిక్షణ | ...... | 34 |


**జన నీరాజనం...**




ఖామెనాయి జనాజాకు
వచ్చిన జన ప్రభంజనం
వివిధ దేశాధినేతలంత
పట్టినరోయ్ నీరాజనం!

దేశమంత ఒక్కటైంది
ఎవరు ఎవరికి చుట్టం
ప్రపంచ ఇతిహాసంలో
ఇదో అరుదైన ఘట్టం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# విద్య

**భారత ప్రభుత్వం బడ్జెట్‌లో** విద్యారంగానికి కేటాయించేది 1,40,400 కోట్ల రూపాయలు. రాహుల్ గాంధీ ఇటీవల చెప్పిన మాటల ప్రకారం స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, NEET, RRB, JEE, UPSC – ఈ ఐదు పరీక్షల్లో పాల్గొనే 2 కోట్ల మంది విద్యార్థుల కుటుంబాలు 3 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాయి. ఆయన మాటల ప్రకారం కేంద్ర ప్రభుత్వం విద్యపై చేసే ఖర్చుకు మూడు రెట్లు ఈ ఐదు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కుటుంబాలు ఖర్చు చేస్తున్నాయి. ఇది ఒక రకమైన దోపిడీ అంటున్నారాయన.

తల్లిదండ్రులు పిల్లలను కేవలం ఈ ఐదు పరీక్షలకు మాత్రమే ఎందుకు సిద్ధం చేస్తుంటారు అనేది కూడా ఆలోచించవలసిన ప్రశ్న. ఎందుకంటే ఈ ఐదు పరీక్షల తర్వాత మాత్రమే సంపాదనావకాశాలుంటాయని భావిస్తారు కాబట్టి.

నీట్ లో 22 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. ఒక్కో విద్యార్థి నీట్ పరీక్షకు ప్రిపరేషన్ కోసం ప్రతి సంవత్సరం 1.32 లక్షలు ఖర్చు చేస్తాడు. 22 లక్షల కుటుంబాలు ఈ ఖర్చు చేస్తున్నాయి. కొందరు తక్కువ ఖర్చు చేయవచ్చు. కొందరు కాస్త ఎక్కువగానే ఖర్చు చేయవచ్చు. దాదాపు 2 కోట్ల మంది విద్యార్థులు స్టాఫ్ సెలెక్షన్ పరీక్షలు రాస్తారు. 5 లక్షల మంది విద్యార్థులు UPSC, 3.58 కోట్ల మంది విద్యార్థులు RRB, 15 లక్షల మంది విద్యార్థులు JEE, 22 లక్షల మంది విద్యార్థులు NEET – ఈ ఐదు పరీక్షల ప్రిపరేషన్ కోసం విద్యార్థుల కుటుంబాలన్నీ కలిసి చేసే ఖర్చు రాహుల్ గాంధీ ప్రకారం 3.5 లక్షల కోట్లు. విద్యార్థుల కుటుంబాలు అప్పులు చేసి, కష్టాలు భరించి ఈ ఖర్చు పెడుతున్నాయి.

ఇలాంటి పరిస్థితి మనం ఆరోగ్య రంగంలో కూడా చూడవచ్చు. ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ రోగి తన జేబులోంచి ఖర్చు పెట్టక తప్పదు. స్కూల్, కాలేజీ ఫీజులు చెల్లించిన తర్వాత, కెరీర్‌ను నిర్మించుకోవాలంటే విద్యారంగంలో కూడా చాలా ఖర్చు చేయాల్సి వస్తోంది? విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తారు. అందులో 80,000 ప్రభుత్వ సీట్లు ఉన్నాయి. కాబట్టి నీట్ పరీక్ష రాసిన 23 లక్షల మంది పిల్లల్లో చాలా మందికి ప్రైవేటులో సీటు కొనుక్కునే పరిస్థితి ఉండదు. అంటే అర్థమేమిటి? నీట్ పరీక్ష రాసిన లక్షలాది విద్యార్థులు పరీక్ష ప్రిపరేషన్ కోసం పెట్టిన ఖర్చు వృధా అయ్యింది. అప్పులు మిగులుతాయి.

భారత విద్యా వ్యవస్థలోని ఒక లోపాన్ని రాహుల్ గాంధీ ఎత్తి చూపారని చెప్పాలి.

అన్ని అవకాశాలు కేవలం ఐదు పరీక్షల్లోనే కుదించబడ్డాయి. ఈ ఐదు పరీక్షల ప్రిపరేషన్ కోసం కోట్లాది మంది విద్యార్థులు తమ సమయాన్ని, డబ్బును ఖర్చు పెడుతున్నారు. ప్రతి 3000 మంది విద్యార్థులలో UPSC లో ఒకరు ఎంపికవుతారు. 3000 మందిలో 30 మంది ఐఐటీ పరీక్ష నెగ్గగలరు. ఈ మొత్తం వ్యవస్థ సంపాదన వ్యవస్థగా మారింది. పరీక్షలకు సన్నద్ధం చేసేవారికి ఇది ఆదాయ వనరుగా మారింది. విద్యాభ్యాసం ప్రైవేట్ స్కూళ్ళు, కాలేజీలలోనే జరిగే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలలు నిరంతరం మూసివేయబడుతున్నాయి, ఉపాధ్యాయులను రకరకాల సర్వేలకు పంపిస్తున్నారని రాహుల్ గాంధీ చెప్పారు. రాహుల్ గాంధీ విద్యను అతిపెద్ద రాజకీయ అంశంగా మార్చగలరా?

అలాంటి రాజకీయ పరిస్థితి ఉందా? దీనిపై చర్చించడానికి యువత సిద్ధంగా ఉందా? హిందూ ముస్లిం రాజకీయాలే ప్రముఖంగా నడుస్తున్నప్పుడు రాహుల్ గాంధీ కోరుతున్నట్లు ఇలాంటి సమస్యలు ముఖ్యమైన రాజకీయ సమస్యలుగా మారే అవకాశాలు కనబడుట లేదు.

రాహుల్ గాంధీ కొంత విభిన్న శైలిలో సభ నిర్వహించారు. నిజానికి రాజకీయ సభల్లో విద్య అనే అంశం బోరింగ్ అంశంగానే ఉంటుంది. రాహుల్ గాంధీ తీసుకున్న అతిపెద్ద రిస్క్ ఇది. ఈ ర్యాలీలో వృద్ధులను రాకుండా అడ్డుకున్నారని, దీనిని యువతకే పరిమితం చేయాలని అనుకున్నారని మీడియాలో వార్తలు వచ్చాయి. ఓట్ల దొంగతనం అంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు చేసినప్పుడు పత్రాలన్నింటినీ వేదికపైకి తీసుకువచ్చేవారు. ప్రెస్ ముందు ఓట్ల దొంగతనం ఎలా జరిగిందో ప్రెజెంటేషన్ ఇచ్చేవారు.

ప్రజల వద్దకు చేరుకోవడానికి రాజకీయ పార్టీలు వివిధ ఫార్మాట్లను ఉపయోగిస్తాయి, ప్రయత్నిస్తాయి. తమిళనాడులో విజయ్ హోలోగ్రామ్ ద్వారా ప్రజల మధ్యకు చేరుకోవడానికి ప్రయత్నించారు. బహిరంగ సభలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కాస్త కొత్త విషయం. రాహుల్ గాంధీ టెలిప్రాంప్టర్ లేకుండా మైక్ చేతిలో పట్టుకుని ముందుకు, వెనుకకు, కుడి, ఎడమలకు నడుస్తూ విద్యార్థులతో సంభాషించారు.

వ్యవస్థ అందరికీ సమానంగా ఉన్నప్పుడే అవకాశాలలో కూడా సమానత్వం వస్తుంది. అందుకే భారత రాజ్యాంగంలో అవకాశాల సమానత్వం గురించి ప్రస్తావించారు. భారతదేశ విద్యావ్యవస్థలో మొదటి లోపం ఏమిటంటే, మన పిల్లల కలలను మనం నెరవేర్చకపోవడం. పిల్లల ఆప్షన్స్, వారు కోరుకునే ఎంపికలను మనం గౌరవించే పరిస్థితి ఉందా? పబ్లిక్ సెక్టార్ లో విద్యావ్యవస్థ ఎందుకు కుదేలయ్యింది? ప్రయివేట్ సెక్టార్ లో విద్య ఎందుకు తప్పనిసరిగా మారిపోయింది? ఎందుకు కిండర్ గార్టెన్ పిల్లలకు కూడా భారీ ఫీజులు చెల్లించే పరిస్థితి వచ్చింది? ఈ ప్రశ్నల గురించి అందరూ ఆలోచించాలి. ✤

అబ్దుల్ వాహెద్




**అమెరికా, ఈరాన్** మధ్య కాల్పుల విరమణ ముగిసిందనే చెప్పాలి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఈ విషయం ప్రకటించేశాడు. ఇదంతా ఎలా ఎందుకు జరిగిందన్నది ఒకసారి పరిశీలిద్దాం.

కాల్పుల విరమణకు కుదిరిన అంగీకారంలో లెబనాన్‌కు సంబంధించిన పాయింట్ ఒక కారణం. ఈ కారణం వల్ల తదుపరి చర్చలు ఆగిపోయాయి. రెండవ కారణం హోర్ముజ్ జలసంధి. ఈ జలసంధి నుంచి వెళ్ళే ఓడలన్నీ ఈరాన్‌తో సమన్వయం చేసుకొని వెళ్ళాలని అంగీకారం కుదిరింది. ఈ నిబంధన విషయంలోనే ఇప్పుడు విభేదాలు మొదలయ్యాయి. తాము నిర్ణయించిన మార్గం నుంచే ఓడలు వెళ్ళాలని ఈరాన్ అంటోంది. ఓడలు ఎలా వెళ్ళినా సరే భద్రతకు ఈరాన్ బాధ్యత వహించాలని అమెరికా చెబుతోంది. ఈ అంగీకారం కుదిరిన తర్వాత చాలా మంది విశ్లేషకులు అమెరికా ఓడిపోయిందనే చెప్పారు. పరువు నిలబెట్టుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఇదంతా అని చెప్పాలి. హోర్ముజ్ జలసంధిలో ఒమన్ ప్రాంతీయ జలాల నుంచి ఈరాన్‌తో సంబంధం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని అమెరికా ప్రయత్నించింది, అక్కడి నుండి కొన్ని ఓడలను పంపాలని చూసింది. కానీ ఆ ఓడలపై ఈరాన్ దాడి చేసింది. ఈ ప్రత్యామ్నాయ మార్గం కాల్పుల విరమణ అంగీకారానికి విరుద్ధమని ఈరాన్ చెబుతోంది.

ఓడలపై ఈరాన్ దాడి చేసి ఒప్పందాన్ని భంగపరచిందనేది అమెరికా వాదన. నిజానికి సమన్వయం చేసుకుని వెళ్ళడమంటే ఈరాన్ అనుమతి తీసుకుని వెళ్ళడమే అవుతుంది. ఈ విషయంలో ఈరాన్ మెత్తబడడానికి సిద్ధంగాలేదు. ఓడలపై దాడి జరిగిన తర్వాత ఒకసారి డోనాల్డ్ ట్రంప్ గొప్పలు చెప్పుకుంటూ, ఓడల ట్రాన్స్‌పాండర్లను ఆఫ్ చేసి, రాత్రి చీకట్లో కొన్ని ఓడలను అక్కడి నుండి దాటించేశాం అన్నాడు. ఈరాన్ ఈ ప్రకటనపై ప్రతిస్పందించలేదు. కాని మరోసారి చీకటి చాటున ఇలాగే ఓడలను దాటించే ప్రయత్నం జరిగినప్పుడు ఈరాన్ దాడి చేసింది. ఈరాన్ దాదాపు ఆరు ఓడలను లక్ష్యంగా చేసుకుంది. ఇందులో ఖతర్ ఓడ కూడా ఉంది. కువైట్ ఓడ కూడా ఉంది, ఇతర దేశాల ఓడలు కూడా ఉన్నాయి. ట్రాన్స్‌పాండర్లను ఆఫ్ చేసి ఒమన్ పక్కన ఉన్న ప్రత్యామ్నాయ మార్గం నుండి దాటించడానికి అమెరికా ప్రయత్నిస్తున్నప్పుడు దాడులు జరిగాయి. ఓడలు ఆగిపోయాయి.

అసలు అమెరికా ఈ ప్రయత్నాలు ఎందుకు చేస్తుంది? అంటే, ఈరాన్ లో ఒకవైపు సుప్రీంలీడర్ అలీ ఖోమెనాయి అంత్యక్రియలు

జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఎలాంటి గొడవలు జరగకుండా అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసేలా చూడాలని ఈరాన్ భావిస్తుంది కాబట్టి ఇదే సరయిన అదునుగా అమెరికా భావించింది. మిగతా దేశాలను కూడా పురికొల్పింది. ఈ మధ్యలో ఒక అమెరికన్ హెలికాప్టర్ కూడా కూలిపోయింది. ఈరాన్ కూల్చివేసిందా లేదా ఏదైనా సాంకేతిక కారణాల వల్ల కూలిపోయిందా అనేది ఇంకా తెలియలేదు. ఇవన్నీ అమెరికాకు సాకులంగా ఉపయోగపడ్డాయి. ఈరాన్‌పై అమెరికా దాడులు చేసింది. ఈరాన్ వెంటనే ఎదురుదాడి ప్రారంభించింది. కువైట్, బహ్రెయిన్ అమెరికా స్థావరాలు మరోసారి నాశనమయ్యాయి. ఈసారి ఈరాన్ దాడులు మరింత ఉధృతంగా జరిగాయని తెలుస్తోంది. డోనాల్డ్ ట్రంప్ నిజానికి నాటో సదస్సులో చాలా నిరాశగానే కనిపించాడు. స్పెయిన్‌పై మండిపడ్డాడు. ఇస్రాయీల్‌పై దాడి చేయకుండా టర్కీని తానే ఆపానని అన్నాడు. టర్కీని మంచి చేసుకునే ప్రయత్నాల్లో ట్రంప్ ఉన్నట్లు కనిపించింది. ఈరాన్‌పై విద్వేష వ్యాఖ్యలు చేశారు. ఈరాన్ ప్రజలు క్యాన్సర్ లాంటి వారని అన్నాడు. ఇంతకు ముందు ఈరాన్ ప్రజలు అక్కడి పాలకులను ద్వేషిస్తున్నారని చెబుతూ వచ్చిన డోనాల్డ్ ట్రంప్ స్వరం ఇప్పుడు మారింది. ఈరాన్ ప్రజలు అమెరికాను ఎంత ద్వేషిస్తున్నారో ప్రపంచానికి కనిపించింది. గత మూడు రోజుల్లో ఎన్నో భ్రమలు తొలగిపోయాయి. ఈరాన్ మెజారిటీ ప్రజలు అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని ఆయన అనుకున్న భ్రమ తొలగింది. ప్రజలు అంత పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చినప్పుడు, మొదట ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు, ఆ తర్వాత ఇవి అబద్ధపు కన్నీళ్లు కావచ్చు అంటూ దిగజారి మాట్లాడారు. ఈరాన్ ప్రజలు ప్లకార్డులు పట్టుకుని ట్రంప్ ఫోటోలపై చెప్పులతో కొట్టడం చూసి కూడా ఆయన ఆశ్చర్య పోయారు. ఈరాన్ ప్రజలు తనను బ్రహ్మరథం పడతారని ఆయన నిన్నటి వరకు అనుకునేవాడు. ఇప్పుడు వాస్తవాలు బోధపడు తున్నాయా? ట్రంప్ ఆశించినట్లు హార్మూజ్ జలసంధి విషయంలో ఈరాన్ ఏమాత్రం రాజీ పడడం లేదు. ఈ యుద్ధం ప్రారంభం కాక ముందు హార్మూజ్ జలసంధి విషయంలో ఎలాంటి వివాదమూ లేదు. ఇప్పుడు అస్సలు సమస్య హార్మూజ్ జలసంధి మాత్రమే అయ్యింది. ఈరాన్ అణుకార్యక్రమం, ఈరాన్ క్షిపణులు, ఈరాన్‌లో ప్రజలపై దౌర్జన్యాలంటూ చెప్పిన కారణాలేవీ ఇప్పుడు వినబడటం లేదు.

ఒమన్ విషయానికి వస్తే, అంతర్జాతీయ సముద్ర రవాణా స్వేచ్ఛా చట్టంపై ఒమన్ సంతకం చేసింది. కాబట్టి ఎలాంటి రుసుము వసూలు చేయలేదు. కాని ఈరాన్ కు అలాంటి సమస్య ఏదీ లేదు. కాబట్టి ఓమన్ జలాల నుంచి వెళితే రుసుము చెల్లించవలసిన అవసరం ఉండదు. కాబట్టి ఈరాన్ ఖచ్చితంగా ఓడలన్నీ తన జలాల నుంచి మాత్రమే వెళ్ళాలని కట్టడి చేస్తోంది. ఒమన్‌పై అమెరికా దౌత్యపరమైన ఒత్తిడి తీసుకువచ్చి తన జలాల నుంచి ఓడలను అనుమతించాలని చెప్పవచ్చు. ఆ ఒత్తిడికి తలొగ్గి ఒమాన్ ఒప్పుకో వచ్చు. కాని ఈరాన్ అనుమతి లేకుండా ఒమాన్ జలాల నుంచి కూడా ఓడలకు భద్రత ఉండదని ఈరాన్ నిరూపించింది. అంతర్జాతీయ న్యాయసూత్రాలను, చట్టాలను అనేకసార్లు తుంగల్లో తొక్కిన అమెరికాకు ఇప్పుడు ఈరాన్ కొరకరాని కొయ్యగా మారింది. మళ్ళీ ఆంక్షలు విధించినా, ఏం చేసినా ఈ ఆంక్షలను దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఈరాన్ దిగివచ్చే అవకాశాలు లేవు. హార్మూజ్ జలసంధి మరోసారి మూతపడింది. అమెరికాతో సహా అన్ని దేశాల్లో చమురు ధరలు పెరుగుతాయి.

ట్రంప్ ఈరాన్‌పై చేసిన దాడిలో భారతదేశం చిక్కుకుపోయిందా అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతోంది. ఈరాన్ ఒక భారతీయ ఓడను నడిసముద్రం నుండి వెనక్కి తిప్పి పంపించేసింది. అప్పుడు అమెరికా మనకేమీ సహాయం చేయలేదు. భారతీయ ట్యాంకర్‌ను ఈరాన్ ముందుకు వెళ్లనివ్వలేదు. అంతకుముందు హార్మూజ్ జలసంధిలో భారతదేశానికి వస్తున్న ఒక ట్యాంకర్‌పై దాడి జరిగింది. అమెరికా ఇరాన్‌పై చేసిన దాడులకు ప్రతిగా ఈరాన్ దాడులతో హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి. భారత చమురు ట్యాంకర్ హార్మూజ్‌లోని ఒమన్ కారిడార్ నుంచి జలసంధిని దాటడానికి ప్రయత్నించినప్పుడు ఈరాన్ వెనక్కి పంపేసింది. హార్మూజ్ జలసంధిపై ఈరాన్ పెత్తనానికి గండి కొట్టడానికి ఒమాన్ కేరిడార్ ఐడియాతో అమెరికా ముందుకు వచ్చినప్పటి నుంచి ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ఇప్పుడు ఈరాన్ హెచ్చరికల తర్వాత చమురు ఓడలు అమెరికా చెబుతున్న ఒమన్ కేరిడార్ నుంచి వెళ్ళడానికి భయపడుతున్నాయి. ఈ భయం ఈరాన్‌కు మరింత బలాన్నిస్తుంది. హార్మూజ్ జలసంధిలో కేవలం ఈరాన్ పెత్తనం మాత్రమే చెల్లుతుందని ఈరాన్ ఖచ్చితంగా చెబుతోంది. మన ఓడలు కూడా అక్కడ చిక్కుకుపోయినా మనం చేసేదేముంది. నిజానికి అమెరికా మన ఓడలను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినప్పుడు కూడా మనం ఏమీ చేయలేకపోయాం. ఇప్పుడు భారత ఓడలకు విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది.

ఈరాన్‌లోని నీటిని శుద్ధి చేసే డీశాలినేషన్ ప్లాంట్లు, ఇంధన కేంద్రాలను ధ్వంసం చేస్తామని ట్రంప్ చెబుతున్నాడు. దీనికి జవాబుగా ఈరాన్ ఏం చేయగలదో కూడా అమెరికాకు తెలుసు. కాని ఈరాన్ ప్రత్యక్షంగా అమెరికా భూభాగంపై దాడులు చేయదు. కేవలం పశ్చిమాసియాలో అమెరికా మిత్రదేశాలుగా, అమెరికా రక్షణ కల్పిస్తుందని ఆశలు పెట్టుకున్న దేశాలన్నీ నాశనమవుతాయి. ఇది అమెరికా ప్రయోజనాలను కూడా పూర్తిగా దెబ్బతీస్తుంది. బహుశా పెట్రోడాలర్ పరిస్థితి పూర్తిగా ధ్వంసం కావచ్చు. దీనికి ట్రంప్ సిద్ధంగా ఉన్నాడా? అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడం ప్రారంభ మవుతుంది. డొనాల్డ్ ట్రంప్ ఎత్తుగడలను కూడా మనం అర్థం చేసుకోవాలి. ఎంత ఎక్కువ ఉద్రిక్తతను సృష్టిస్తే, అమెరికా అంత ఎక్కువ డబ్బును ముద్రిస్తుంది. అమెరికా ఆ డబ్బును తన జేబులో వేసుకుంటుంది. ఆయుధాలు అమ్ముడవుతాయి. ఓడల భీమా ఖర్చులు, రవాణా ఛార్జీలు పెరుగుతాయి. ఇది ట్రంప్ ఆశించే ప్రయోజనమా?

ప్రతిసారీ చర్చలు జరగాల్సి ఉన్నప్పుడు, డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను

బెదిరించడానికి ప్రయత్నిస్తుంటాడు. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాడు. ఈరాన్ వీధుల్లో మిలియన్ల కొద్దీ ప్రజలు తమ నాయకుడికి మద్దతుగా నిలవడం ఆయన భరించలేక పోతున్నాడు. అమెరికాలో ఎంత మంది ఇలా తమ నాయకుడి కోసం నిలబడతారు? ఈ ప్రజా బలం ఈరాన్‌కు కలిసి వస్తుంది, చర్చల్లో ఈరాన్ మరింత బలంగా ఉంటుంది.

ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే బలహీనమైన అమెరికా బెదిరించాలని చూస్తోంది. ఉద్రిక్తతలు తగ్గించడానికి మరోసారి జె.డి. వాన్స్ రంగంలోకి రావచ్చు. ఈరాన్ వైఖరి స్పష్టంగా ఉంది. నువ్వు తమలపాకుతో ఒకటిస్తే నేను తలుపు చెక్కతో రెండిస్తా అన్నట్లుంది.

హోర్ముజ్ జలసంధిపై ఈరాన్ ఎందుకు నియంత్రణను కోరుకుంటుందో కూడా అర్థం చేసుకోవాలి. ఇది కేవలం డబ్బుకు సంబంధించిన విషయం కాదు. ఇది ఈరాన్ భద్రతకు సంబంధించిన విషయం. హోర్ముజ్ జలసంధి ఈరాన్ వద్ద ఉన్న అణుబాంబు. దశాబ్దాల క్రితం అమెరికా ఇదే ప్రాంతంలో ఇరాన్‌కు చెందిన ఒక ప్రయాణీకుల విమానాన్ని కూల్చివేసింది, అందులో సాధారణ పౌరులు ప్రయాణిస్తున్నారు. 300 మందికి పైగా మరణించారు, అమెరికా దానికి ఎప్పుడూ క్షమాపణ చెప్పలేదు. గత 30-40 ఏళ్లలో ఈరాన్ ఎంతో భరించింది. యుద్ధానికి దిగకుండా సంయమనం పాటించింది. ఈరాన్ చిన్న చితక యుద్ధాల్లో దిగాలని అనుకోలేదు. ఒక పెద్ద యుద్ధం అమెరికాతో, ఇస్రాయీల్‌తో తప్పదని ఈరాన్ కు బాగా తెలుసు. ఆ యుద్ధ ఏర్పాట్లలో దశాబ్దాలు గడిపింది. ఈరాన్ అణుబాంబు తయారు చేయదన్నది ప్రపంచంలో చాలా దేశాలకు, అమెరికాకు కూడా స్పష్టంగా తెలుసు. ఎందుకంటే, ఈరాన్‌కు అణుబాంబు అవసరమే లేదు. పైగా ఖొమేనీ ఫత్వా కూడా ఉంది. అణుబాంబు లేకపోయినా అణుశక్తి దేశాల మెడలు వంచడం కూడా ఈరాన్ కు తెలుసన్నది ఇప్పుడు స్పష్టంగా ప్రపంచం చూసింది.

ఈ యుద్ధానికి ముందు ఈరాన్ ఎన్నడూ హోర్ముజ్ జలసంధిని మూసే ప్రయత్నాలు చేయలేదు. ఈ ఆయుధాన్ని అదును చూసి ప్రయోగించింది. హోర్ముజ్ జలసంధిని ఈ స్థాయిలో ఈరాన్ నియంత్రించగలదని అమెరికా అనుకోలేదు. హోర్ముజ్ జలసంధి విషయంలో ఈరాన్ షరతులకు ఒప్పుకుంటూ అంగీకారం కుదుర్చుకున్న తర్వాత దొడ్డిదోవన హోర్ముజ్ జలసంధిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనే ప్రయత్నాలు అమెరికా చేసింది. కాని సైనికంగా హోర్ముజ్ జలసంధిలో ఈరాన్‌ను నిలువరించడం అమెరికాకు సాధ్యం కావడం లేదు. హోర్ముజ్ జలసంధి మరోసారి పూర్తిగా మూసేస్తే చమురు సంక్షోభం మరోసారి మొదలవుతుంది.

ఈ మొత్తం వ్యవహారంలో మరో కోణం లెబనాన్. ఇస్రాయీల్ వివిధ దేశాలకు చెందిన తన ఏజెంట్లను హిజ్బుల్లా ప్రాంతమైన దక్షిణ లెబనాన్‌లోకి పంపింది. వారిని గుర్తించిన హిజ్బుల్లా హతమార్చింది. అవగాహన ఒప్పందంలోని మొదటి పేరానే లెబనాన్‌తో సహా అన్ని రంగాల్లో యుద్ధం ముగుస్తుందని చెబుతోంది. కాని ఇస్రాయీల్ ఇప్పుడు మరోసారి లెబనాన్‌పై దాడి చేసింది. లెబనాన్ విషయంలో ఈరాన్ చాలా స్పష్టంగా ఉంది. లెబనాన్ సరిహద్దులో యుద్ధం ఆగే వరకు తదుపరి చర్చలకు అర్థం లేదని ప్రకటించింది. అవగాహనా ఒప్పందం తర్వాత ఈ 60 రోజుల్లో చాలా చమురును నిల్వ చేసుకోవచ్చు. అమెరికా క్యాంపులో ఉన్న అనుకూల దేశాలు కూడా చాలా చమురును నిల్వ చేసుకుంటాయి. అప్పుడు చమురు సంక్షోభం, ఆయిల్ ప్రాబ్లమ్ తీరిపోతుంది. అప్పుడు ఈరాన్‌పై దాడి చేసి నాశనం చేద్దామనే కల ఇప్పుడు అర్థాంతరంగా బెడిసికొట్టింది. లెబనాన్‌లో యుద్ధం ఆపాలనే నిజాయితీ ఎన్నడూలేదు. భద్రత కోసం గల్ఫ్ దేశాలు ఈరాన్‌కు దగ్గరవుతున్నాయని అమెరికాకు వార్త అందగానే, ట్రంప్ సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, బహ్రెయిన్ వంటి దేశాల సమావేశం జరిగేలా, హోర్ముజ్ జలసంధి విషయంలో ఈరాన్‌ను ఖండించేలా చేశాడు. ఆ తర్వాత అతను లెబనాన్‌కు వెళ్ళి, ఇస్రాయీల్ లెబనాన్ ప్రభుత్వం మధ్య ఒక ఒప్పందాన్ని కుదిర్చాడు. లెబనాన్ ప్రభుత్వానికి లెబనాన్ లో ఎంత బలం ఉందో ప్రపంచానికి బాగా తెలుసు. ఆ ఒప్పందం ప్రకారం, హిజ్బుల్లా ప్రాంతంలో పనిచేయడానికి ఇస్రాయీల్ సైన్యానికి పూర్తి స్వేచ్ఛ లభించింది. అంటే, యుద్ధాన్ని ముగించడానికి బదులుగా, యుద్ధాన్ని తీవ్రతరం చేయడానికి, యుద్ధంలో ఇజ్రాయెల్‌కు ప్రయోజనం చేకూర్చడానికి పూర్తి ఏర్పాట్లు చేశారు. అమెరికా ఒక వైపు శాంతి గురించి మాట్లాడుతూ, మరో వైపు శాంతికి తూట్లు పొడుస్తుంది.


ఇప్పుడు పాకిస్తాన్ పరిస్థితి దున్నల పోరులో చిక్కుకున్న లేగదూడలా ఉంది. ఖతర్ పరిస్థితి కూడా అదే. ఎందుకంటే వారే మధ్యవర్తులు, వారే శాంతి ప్రయత్నాలు, ఒప్పందాల కోసం కృషి చేశారు. ఈరాన్, అమెరికా మధ్య ఒప్పందం కుదిర్చింది వీరే. పాకిస్తాన్, ఖతర్ దేశాలు అటు అమెరికాను కాని, ఇటు ఈరాన్‌ను కాని నియంత్రించలేవు. వాటికి అంత బలం లేదు. ఈరాన్ సంయమనం పాటించాలని చెప్పేస్థితి పాకిస్తాన్‌కు కాని, ఖతర్‌కు కాని ఇప్పుడు లేదు. నిజానికి ఇంతకు ముందు కుదిరిన అవగాహనా ఒప్పందం కూడా అమెరికాకు అవసరం కాబట్టి, ఈరాన్‌తో మాట్లాడడానికి సాహసించారు. ఇప్పుడు ఈరాన్ నేతలు మాట్లాడడానికి ఇష్టపడతారా? ఈరాన్ లేదా అమెరికాపై ఒత్తిడి తెచ్చే స్థితిలో పాకిస్తాన్ లేదా ఖతార్ లేవు. ఈ యుద్ధాన్ని ఆపగలిగేది ఒక్కటే, అదే మార్కెట్. ఇప్పటివరకు దాడులు శని, ఆదివారాలు అంటే వారాంతాల్లోనే జరిగాయి. కాని ఇప్పుడు వారం మధ్యలో జరిగాయి. మరో నాలుగు రోజులు ఈ దాడులు కొనసాగవచ్చు. మరోసారి చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి. అమెరికాపై కూడా భయంకరమైన ఒత్తిడి పడుతుంది. బహుశా వారాంతం తర్వాత మరోసారి ట్రంప్ ముందుకు వచ్చి పాకిస్తాన్, ఖతర్ దేశాల విజ్ఞప్తి మేరకు దాడులు చేయకుండా ఆగుతున్నానని చెప్పవచ్చు. మార్కెట్‌ను మరోసారి నిలబెట్టే ప్రయత్నాలు జరగవచ్చు. అయితే ఇప్పుడు ఈరాన్ చర్చలకు అంత తేలిగ్గా ఒప్పుకుంటుందా అనేది ప్రశ్న. ఇప్పుడు ఈరాన్ మరింత స్పష్టంగా షరతులు పెట్టవచ్చు. కాబట్టిపరిస్థితి ప్రమాదకరంగానే కనిపిస్తోంది. ✤

# ఆశల ఉషోదయానికి అక్షరాల తోరణం

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

సాహిత్య చరిత్రలో కొన్ని పుస్తకాలు ఒక వ్యక్తి జీవితానుభవాల సారంగా, ఒక యుగపు చైతన్య స్పందనగా, ఒక అంతరంగ యాత్రకు ప్రతిరూపంగా అవతరిస్తాయి. ప్రముఖ సాహితీవేత్త, రచయిత, విమర్శకుడు, అనువాదకుడు, **సంపాదకుడు ఎస్. ఎం. మలిక్ గారి** 'తెల్లవారబోతోంది' కవితా సంకలనం అలాంటి అరుదైన గ్రంథాలలో ఒకటి.

'తెల్లవారబోతోంది' అనే శీర్షికలోనే ఒక తాత్విక ప్రకటన దాగి ఉంది. అది కేవలం రాత్రి నుంచి పగలుకు జరిగే సహజ పరిణామాన్ని సూచించే పదబంధం కాదు; నిరాశ నుంచి ఆశకు, నిస్సహాయత నుంచి నూతన చైతన్యానికి, చీకటి నుంచి వెలుగుకు జరిగే మానవ అంతర్యాత్రకు ప్రతీక. ఈ శీర్షిక మొత్తం సంకలనానికి ఒక తాత్విక ధ్రువతారగా నిలుస్తుంది. కవి దృష్టిలో జీవితం ఎన్నో సంక్షోభాల సమాహారమైన ప్పటికీ, ప్రతి సంక్షోభం వెనుక ఒక కొత్త ఉదయం దాగి ఉంటుందనే విశ్వాసమే ఈ కవిత్వానికి మూలస్వరంగా వినిపిస్తుంది.




ఎస్. ఎం. మలిక్ గారి సాహిత్య వ్యక్తిత్వం బహుముఖీనమైనది. పవిత్ర ఖుర్ఆన్‌ను సరళమైన తేటతెలుగులో అనువదించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేసిన ఆయన, దైవ ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత చరిత్ర, ఖులఫాయె రాషిదీన్ చరిత్ర, సహాబాల జీవిత విశేషాలు వంటి అనేక విలువైన గ్రంథాలను రచించి తెలుగు ముస్లిం సాహిత్య ప్రపంచంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించారు. నాలుగు న్నర దశాబ్దాలకు పైగా 'గీటురాయి' వార పత్రిక సంపాదకత్వాన్ని నిర్వర్తించడం ద్వారా ఆయన కేవలం సంపాదకుడిగానే కాక, ఒక సాహిత్య సంస్కర్తగా, భావప్రేరకుడిగా నిలిచారు.

ఈ సందర్భంలో ఒక వ్యక్తిగత అనుబంధాన్ని స్మరించుకోవడం అవసరం. మలిక్ గారు కేవలం సంపాదకుడు మాత్రమే కాదు, నాకు పరోక్ష గురువు కూడా. మూడున్నర దశాబ్దా

లకు పూర్వం గీటురాయిలో నా తొలి రచనా ప్రయత్నాలను గమనించి ఎంతో ప్రోత్సహించారు. ఉర్దూ పత్రికల కటింగ్స్ పంపిస్తూ వాటిని తెలుగులోకి అనువదించమని పురమాయించే వారు. నేను పంపిన అనువాదాలను పరిశీలించి ఎక్కడ సవరణలు అవసరమో, భావాన్ని ఎలా పదును పెట్టాలో, భాషను ఎలా మెరుగుపరచాలో లేఖల ద్వారా సూచించేవారు. ఆ మార్గదర్శకత్వం నా రచనా ప్రయాణానికి బలమైన పునాదిగా నిలిచింది. అందుకే ఈ గ్రంథాన్ని చదువుతున్నప్పుడు ఒక పాఠకుడిగానే కాదు, ఆయన ప్రోత్సాహాన్ని పొందిన శిష్యుడిగా కూడా గర్వపడుతున్నాను.

అయితే ఈ సంకలనంలో మనకు దర్శనమిచ్చేది సంపాదకుడు మలిక్ కాదు; అంతర్ముఖ కవి మలిక్. అనుభవాల అగ్నిగర్భంలో కాలిన మనసు, విశ్వాసపు వెలుగులో తడిసిన హృదయం, మానవీయ విలువల పట్ల అంకితభావం కలిగిన చింతకుడు ఇక్కడ కవిత్వరూపంలో పలుకుతాడు.

ఈ సంకలనంలోని కవితలను పరిశీలిస్తే, అవి అలంకారాల ఆర్భాటంతో కాక, భావాల నిజాయితీతో పాఠకుడిని ఆకట్టుకుంటాయని స్పష్టమవుతుంది. కవి తన అనుభవాలను కృత్రిమ కవిత్వ శిల్పంలో బంధించకుండా సహజ ప్రవాహంలో వ్యక్తపరిచాడు. అందువల్ల ఈ కవిత్వం చదువుతున్నప్పుడు కవిని చదువుతున్నామా? లేక మనల్ని మనమే చదువుకుంటున్నామా? అన్న అనుభూతి కలుగుతుంది.

'వాస్తవాలు' కవిత ఈ సంకలనంలోని ప్రధాన తాత్విక స్వరాలలో ఒకటి. జీవితం అనేది మధురం, విషాదం, విజయాలు, వైఫల్యాల మిశ్రమమని కవి సున్నితంగా గుర్తుచేస్తాడు. వాస్తవాన్ని రుచితో పోల్చడం ద్వారా అనుభవానికి ఒక ఇంద్రియాత్మక రూపాన్ని కల్పించాడు. జీవితం అనుభవించబడేదే తప్ప, కేవలం అర్థం చేసుకోవాల్సింది కాదనే లోతైన భావం ఇందులో అంతర్లీనంగా ఉంది. వాస్తవాన్ని అంగీకరించడం ద్వారానే మనిషి తన ఉనికిని సార్థకం చేసుకోగలడనే జీవన సత్యాన్ని కవి ప్రతిపాదించాడు.

'లోలోనే' కవిత మానవ మనస్తత్వంలోని అంతర్గత సంఘర్షణలకు ప్రతిబింబంగా నిలుస్తుంది. మనసు అనేది తర్కానికి మాత్రమే లోబడే వ్యవస్థ కాదని, కోరికలు, బలహీనతలు, ఆశలు, ఆకర్షణలు కలిసిన సంక్లిష్ట ప్రపంచమని కవి సూచిస్తాడు. 'గుండె సందుల్లోంచి' అనే ప్రతీకాత్మక వ్యక్తీకరణ ద్వారా అంతర్మనస్సు అగోచర కదలికలను కవి అద్భుతంగా ఆవిష్కరించాడు. ఈ కవిత పాఠకుడిని ఆత్మపరిశీలన వైపు నడిపించే అరుదైన రచనగా నిలుస్తుంది.

సంకలనంలోని 'వంతెన' కవిత మానవతా దృక్పథానికి ప్రతినిధిగా నిలుస్తుంది. నేటి విభజనల ప్రపంచంలో ప్రేమ, సానుభూతి, సహజీవనం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు కవి కవితాత్మక రూపాన్ని ఇచ్చాడు. ఈ కవితలో అనురాగం సంగీతమవుతుంది; సానుభూతి శృతిలయమవుతుంది; మానవత ఒక నిర్మాణ శక్తిగా రూపుదిద్దుకుంటుంది. కవి కలలుగన్న సమాజం రాజకీయ సరిహద్దులతో కాక, మానవీయ విలువలతో నిర్మితమయ్యే సమాజం. అందుకే ఈ కవిత కేవలం ఒక భావ వ్యక్తీకరణగా కాక, విభజనలతో అలసిపోయిన సమాజానికి ఒక మానవీయ ప్రకటనగా నిలుస్తుంది.

మలిక్ గారి కవిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెట్టేది దాని భాషా స్వచ్ఛత, భావవ్యక్తీకరణలోని నిరాడంబరత. ఆధునిక కవిత్వంలో తరచుగా కనిపించే క్లిష్టత, ప్రతీకల అతిశయం, అర్థదుర్భేద్యతలకు భిన్నంగా ఆయన కవిత్వం పాఠకునితో నేరుగా సంభాషిస్తుంది. సాధారణ పదాలను అసాధారణ భావాలతో నింపడం ఆయన కవితా శైలిలోని విశిష్టత. అందువల్ల ఈ కవితలు చదివేటప్పుడు అవి కేవలం కళ్ల మీదుగా జారిపోవు; హృదయంలోకి ప్రవేశించి ఆలోచనలను మేల్కొలుపుతాయి. ఆయన పదాల్లో ఒక సాధకుని వినయం ఉంది, ఒక విశ్వాసి హృదయ స్పందన ఉంది, ఒక మానవతావాది ఆవేదన ఉంది. అందుకే ఈ సంకలనంలోని ప్రతి కవిత ఒక సాహిత్య ప్రకటనగా మాత్రమే కాక, జీవితం పట్ల మరింత బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవరచుకునే ఆహ్వానంగా కూడా నిలుస్తుంది.

ఈ సంకలనానికి మరో విశిష్టత, మలిక్ గారి సాహిత్య సాధనపై ప్రముఖ సాహితీవేత్తలు వ్యక్తం చేసిన ప్రశంసాత్మక అభిప్రాయాలు. విప్లవ కవి వరవరరావు, ప్రముఖ కవి శివారెడ్డి, కరిముల్లా, ప్రసిద్ధి కవి దివంగత దేవీప్రియ వంటి తెలుగు సాహిత్య రంగంలోని విశిష్ట వ్యక్తిత్వాలు మలిక్ గారి రచనా ప్రయాణాన్ని, సాహిత్య నిబద్ధతను, మానవీయ దృక్పథాన్ని ప్రశంసిస్తూ తమ విలువైన అభిప్రాయాలను నమోదు చేయడం ఈ గ్రంథానికి అదనపు గౌరవాన్ని తీసుకువచ్చింది. భిన్న భావ జాలాలకు, విభిన్న సాహిత్య ధోరణులకు ప్రాతినిధ్యం వహించిన ఈ మహనీయులందరూ మలిక్ గారి రచనల్లోని నిజాయితీని,

మానవీయ విలువలను, సాహిత్య అంకితభావాన్ని గుర్తించడం ఆయన సాహిత్య వ్యక్తిత్వ విస్తృతిని తెలియజేస్తుంది. ఒక రచయితను అతని రచనలు మాత్రమే కాక, సమకాలీన సాహిత్య ప్రపంచం అతనికి ఇచ్చిన గౌరవంగా నిలుస్తుంది. ఆ దృష్ట్యా ఈ సంకలనంలో చోటు చేసుకున్న ఈ అభిప్రాయాలు పుస్తకానికి మరింత ప్రామాణికతను, విశ్వసనీయతను, సాహిత్య విలువను జోడించాయి.

మలిక్ గారి కవిత్వంలో మరో విశేషం దాని వినయపూర్వక స్వభావం. 'ఇదో... మాట' లో ఆయన ఈ రచనలను కవితలుగా పరిగణించడానికే సంకోచిస్తారు. అవి తన మనసులో కలిగిన స్పందనలేనని పేర్కొంటారు. కానీ గొప్ప కవిత్వం తరచుగా ఇలాంటి వినయంతోనే పుడుతుంది. ఎందుకంటే నిజమైన కవి తన రచనల గొప్పతనాన్ని ప్రకటించడు; తన అనుభవాలను మాత్రమే పంచుకుంటాడు. వాటి విలువను నిర్ణయించేది కాలం, పాఠకులు.

ఈ సంకలనమంతటా ఆశావాదం ఒక అంతర్వాహినిలా ప్రవహిస్తుంది. జీవితం ఎన్నో అనిశ్చితులతో నిండిపోయినా, నిరాశకు లొంగిపోకుండా ముందుకు సాగాలనే సందేశం ప్రతి కవితలోనూ ప్రతిధ్వనిస్తుంది. ముఖ్యంగా 'తెల్లవారబోతోంది' అనే శీర్షిక కవితలో కవి ప్రతిపాదించిన జీవన తత్త్వం ఈ సంకలనానికి పరాకాష్ఠగా నిలుస్తుంది. చీకటి శాశ్వతం కాదని, దుఃఖం అంతిమం కాదని, ప్రతి ముగింపులో ఒక కొత్త ఆరంభం దాగి ఉంటుందని కవి మనకు ధైర్యం చెబుతాడు. ఈ కవితలో కాలచక్రం, జీవనగమనం, ఆశ, పునరుజ్జీవనం అన్నీ సమన్వితమై ఒక సమగ్ర జీవన దర్శనంగా రూపుదిద్దుకున్నాయి.

'తెల్లవారబోతోంది' కవితా సంకలనం ఆధునిక తెలుగు కవిత్వంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించగల సామర్థ్యం కలిగిన గ్రంథం. ఇది భావోద్వేగాల వ్యక్తీకరణ మాత్రమే కాదు; ఒక ఆధ్యాత్మిక అన్వేషణ, ఒక మానవీయ ప్రకటన, ఒక ఆశావహ జీవన తత్త్వం. ఈ కవితలు పాఠకుడికి కేవలం సాహిత్యానందాన్నే కాక, ఆత్మపరిశీలనకు అవకాశాన్ని కూడా కల్పిస్తాయి.

మొత్తానికి, 'తెల్లవారబోతోంది' కేవలం ఒక కవితా సంకలనం మాత్రమే కాదు; అది ఒక వెలుగు ప్రయాణం. ఒక మనసు నుంచి మరొక మనసుకు చేరే ఆశా సందేశం. చీకటి ఎంత గాఢమైనదైనా, చివరికి ఉదయమే గెలుస్తుందనే విశ్వాస గీతం. ఎస్. ఎమ్. మలిక్ గారి సుదీర్ఘ సాహిత్య సాధనకు ఈ గ్రంథం ఒక కవితాత్మక సాక్ష్యం, తెలుగు సాహిత్యానికి ఒక విలువైన కానుక.

కరుణామయుడైన దైవం మలిక్ గారికి పరిపూర్ణ ఆరోగ్యం, ఆయుష్షును ప్రసాదించి, ఆయన కలం నుంచి మరిన్ని విలువైన రచనలు వెలువడేలా అనుగ్రహించాలని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

**పుస్తకం పేరు: తెల్లవారబోతోంది**
**రచయిత: ఎస్.ఎమ్. మలిక్**
**వెల: 200/-**
**దొరుకుచోటు: తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్,**
**చత్తాబజార్, హైదరాబాద్-500 002.**
**ఫోన్: 7660012481, 9700255736**

★★★


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.



# ప్రస్తుత సామాజిక సంక్షోభం- ముస్లింల బాధ్యత :

## జమాఅతె ఇస్లామీ హింద్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సలీం ఇంజనీర్ దిశానిర్దేశం

**దేశంలో వేగంగా మారుతున్న సామాజిక, రాజకీయ వాతావరణం, ప్రజాస్వామ్య విలువల క్షీణత, పెరిగిపోతున్న మతపరమైన విభజనల నేపథ్యంలో, భారతీయ ముస్లింలు అత్యంత బాధ్యతాయుతంగా, సహనంతో, నైతిక దృఢత్వంతో వ్యవహరించాలని జమాఅతె ఇస్లామీ హింద్ (JIH) వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సలీం ఇంజనీర్ పిలుపునిచ్చారు.**

JIH ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక కీలక సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, ప్రస్తుత పరిస్థితులు కేవలం ముస్లింలకు మాత్రమే కాకుండా, మొత్తం దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు పరీక్షగా నిలుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన

ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడుతున్నాయని, పార్లమెంటరీ చర్చల గౌరవం మసకబారుతోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**చట్టంపై వివక్ష :** నేరారోపణలు ఎదుర్కొంటున్న ముస్లింల పట్ల చట్టం అమలులో కనిపిస్తున్న పక్షపాతం, "బుల్డోజర్" సంస్కృతి, అణచివేత ధోరణులు దేశంలో భయాందోళనలను పెంచుతున్నాయని ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

**ఎన్నికల ప్రక్రియ :** ఓటర్ల జాబితా సవరణ వంటి ప్రక్రియల ద్వారా మైనారిటీల ఓటింగ్ హక్కులను కాలరాసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

### సమస్యల పట్ల దృక్పథం - 'డాక్టర్' ఉపమానం

"ఒక రోగి హింసాత్మకంగా ప్రవర్తిస్తున్నప్పుడు, డాక్టర్ తనను తాను రక్షించుకుంటూనే, ఆ రోగిని నయం చేయడానికి ఎలా ప్రయత్నిస్తాడో, ముస్లింలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో తమను తాము కాపాడుకుంటూనే, సమాజంలో నెలకొన్న అశాంతిని తొలగించేలా నైతిక మార్గంలో పయనించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

### డిజిటల్ గెట్టోయిజేషన్ - మేధోపరమైన సవాలు

నేటి కృత్రిమ మేధస్సు (AI), సోషల్ మీడియా యుగంలో, మనుషులు తమకు నచ్చిన సమాచారానికే పరిమితమై "డిజిటల్ గెట్టోయిజేషన్"కు గురవుతున్నారని ఆయన హెచ్చరించారు. "AI అందించే సమాచారానికి బానిసలుగా మారకుండా, విమర్శనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలి. లేనిచో, అది మనలోని పాత అభిప్రాయాలనే బలపరిచి, సత్యాన్ని గ్రహించకుండా అడ్డుకుంటుంది" అని ఆయన విశ్లేషించారు.

### నిర్మాణాత్మకమైన బాధ్యత

ముస్లింలు కేవలం తమ హక్కుల గురించి మాత్రమే కాకుండా, 145 కోట్ల మంది భారతీయుల సంక్షేమం కోసం పని చేయాల్సిన బాధ్యత తమపై ఉందని ప్రొఫెసర్ సలీం గుర్తు చేశారు. అంతర్గత వివాదాలు, అర్థరహితమైన సోషల్ మీడియా చర్చల్లో కాలక్షేపం చేయకుండా, దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు.

ప్రవక్త ముహమ్మద్ (స) జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ– కష్టకాలంలో కూడా నైతిక విలువలను వదలకూడదని, 'సబర్' (సహనం) అంటే ఓడిపోవడం కాదని, అది గౌరవప్రదంగా నిలబడటమని ఆయన స్పష్టం చేశారు. దేశం పట్ల తమకున్న బాధ్యతలను నైతిక ప్రవర్తన, ప్రజాసేవ, నిర్మాణాత్మకమైన సంభాషణల ద్వారా నెరవేర్చాలని ఆయన ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు.



# భారత ప్రధానలు

**ముహమ్మద్ హారూన్ అహ్మద్ ఖాన్**

చరిత్ర కొందరిని కొన్ని విజయాల కారణంగా, మరికొందరిని వారు తీసుకున్న నిర్ణయాల ప్రభావం కారణంగా గుర్తుంచుకుంటుంది. దేశాన్ని పాలించిన ప్రతి ప్రధానమంత్రి తనదైన ముద్రను భారత చరిత్రపై వదిలి వెళ్లారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసి బహుళార్థ సాధక ప్రాజెక్టులు, ఐఐటీలు, ఇస్రో వంటి పరిశోధనా సంస్థలను నెలకొల్పి ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్ జై కిసాన్' నినాదంతో దేశంలో హరిత విప్లవానికి, శ్వేత విప్లవానికి పునాది వేశారు. 1965 భారత్ – పాక్ యుద్ధ సమయంలో దేశాన్ని సమర్థవంతంగా నడిపించి, అత్యంత నిరాడంబరమైన, నీతివంతమైన నాయకత్వానికి ప్రతీకగా నిలిచారు.

ఇందిరా గాంధీ జాతీయ భద్రత, అంతర్గత సంక్షోభాల సమయంలో కఠినమైన నిర్ణయాలు తీసుకున్న నాయకురాలిగా నిలిచి 'ఉక్కు మహిళ' గా చరిత్రలో స్థానం సంపాదించారు.

పి.వి. నరసింహారావు ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక దిశను మార్చి ఆధునిక భారత అభివృద్ధికి బాటలు వేశారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి రాజకీయ సంస్కారానికి, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించే సమన్వయ నాయకత్వానికి ప్రతీకగా నిలిచారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థికవేత్తగా దేశాన్ని ప్రపంచ ఆర్థిక సంక్షోభాల నుండి కాపాడారు. సమాచార హక్కు చట్టం (RTI), ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు చట్టం వంటి చారిత్రాత్మక హక్కుల ఆధారిత చట్టాల ద్వారా సామాన్యుడికి, బలహీన వర్గాలకు చట్టపరమైన రక్షణ కల్పించిన శాంతస్వభావుడైన నాయకుడిగా గుర్తింపు పొందారు.

## మోడీ పాలన: విమర్శలు, వివాదాలు

మరి భవిష్యత్తులో చరిత్ర నరేంద్ర మోడీని ఏ విధంగా గుర్తుంచుకుంటుంది? విమర్శకులు, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో ఆయన పాలన భారత రాజ్యాంగ పునాదులను, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసిన కాలంగా, అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠగా గుర్తుండిపోయే ప్రమాదం ఉంది. ఆయనపై వచ్చే ప్రధాన విమర్శలు, దేశంపై పడిన ప్రతికూల ప్రభావాలు ఏమిటో ఒకసారి అవలోకిద్దాం:

## సామాజిక విభజన, మైనారిటీల భద్రతపై విమర్శలు

ఆయన రాజకీయ ప్రయాణం మొదటి నుండి తీవ్ర వివాదాలతో కూడుకున్నది. 2002 గుజరాత్ అల్లర్ల మరక ఆయన రాజకీయ జీవితాన్ని విశ్లేషించే ప్రతి చర్చలోనూ ప్రముఖంగా వస్తుంది. ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చాక, దేశంలో మతపరమైన ధ్రువీకరణ (Polarization) పరాకాష్ఠకు చేరిందనే విమర్శ ఉంది. గోరక్షణ పేరిట జరిగిన మూకదాడులు (Lynching), విద్వేష ప్రసంగాలు (Hate Speech) పెరగడం, పౌరసత్వ సవరణ చట్టం (CAA), జాతీయ పౌరుల నమోదు (NRC) వంటి నిర్ణయాలు మైనారిటీలలో, ముఖ్యంగా ముస్లింలలో తీవ్ర అభద్రతా భావాన్ని సృష్టించాయి. దేశ శతాబ్దాల నాటి లౌకికత్వ భావనను దెబ్బతీసి, సమాజాన్ని మత ప్రాతిపదికన విభజించారనేది ఆయనపై ఉన్న అతిపెద్ద ఆరోపణ.

## ఆర్థిక విధ్వంసం, ప్రజల ఇబ్బందులు

2016లో తీసుకున్న నోట్ల రద్దు (Demonetisation) నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా అసంఘటిత రంగం, చిన్న వ్యాపారాలపై కోలుకోలేని దెబ్బకొట్టింది. నల్లధనం అరికట్టడమనే లక్ష్యం నెరవేరకపోగా, వందలాది మంది సామాన్యులు బ్యాంకుల ముందు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. దీన్ని ఒక 'పిచ్చి నిర్ణయం'గా విమర్శకులు అభివర్ణిస్తారు. అలాగే, ప్రభుత్వరంగ సంస్థల (LIC, ఎయిర్ ఇండియా, రైల్వేలు, పోర్టులు) విచక్షణారహిత ప్రైవేటీకరణ ద్వారా దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్ మిత్రులకు (Cronism) కట్టబెట్టారనే

**లాల్ బహదూర్ శాస్త్రి వంటి నైతికత, మన్మోహన్ సింగ్ వంటి పారదర్శకమైన, చట్టబద్ధమైన హక్కుల పాలనతో పోల్చినప్పుడు.. మోడీ పాలన ప్రజాస్వామ్య విలువల పతనానికి, అధికార కేంద్రీకరణకు సాక్ష్యంగా నిలుస్తుందని విమర్శకుల స్పష్టమైన వాదన.**

ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.

## రాజ్యాంగ సంస్థల నిర్వీర్యం, అధికార కేంద్రీకరణ

మోడీ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలోని స్వతంత్ర సంస్థలైన ED, CBI, IT, EC, న్యాయవ్యవస్థ సైతం ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగిపోయాయనే ఆందోళన బలంగా వ్యక్తమైంది. ప్రతిపక్ష నాయకులను వేధించడానికి, ప్రాంతీయ ప్రభుత్వాలను కూల్చడానికి దర్యాప్తు సంస్థలను ఒక ఆయుధంగా వాడుకున్నారనే విమర్శ ఉంది. నిర్ణయాధికారం కేవలం పీఎంఓ (PMO) చేతుల్లోనే కేంద్రీకృతమై, సమాఖ్య స్ఫూర్తిని, రాష్ట్రాల హక్కులను కాలరాశారని విమర్శకులు వాదిస్తారు.

## మీడియా స్వేచ్ఛ హరింపు, 'గోదీ మీడియా' సంస్కృతి

ప్రశ్నించే మీడియా గొంతుకలను నొక్కేయడం, భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచే జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలపై కఠినమైన చట్టాలను (UAPA వంటివి) ప్రయోగించి జైళ్లలో పెట్టడం, ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారత్ స్థానం దిగజారడం, ప్రభుత్వానికి భజన చేసే 'గోదీ మీడియా' సంస్కృతి పెరగడం ప్రజాస్వామ్యానికి పెద్ద మైనస్ పాయింట్‌గా మారింది.

లాల్ బహదూర్ శాస్త్రి వంటి నైతికత, మన్మోహన్ సింగ్ వంటి పారదర్శకమైన, చట్టబద్ధమైన హక్కుల పాలనతో పోల్చినప్పుడు.. మోడీ పాలన ప్రజాస్వామ్య విలువల పతనానికి, అధికార కేంద్రీకరణకు సాక్ష్యంగా నిలుస్తుందని విమర్శకుల స్పష్టమైన వాదన.



- ఇక్బాల్ మోహియుద్దీన్

# అక్షరమే వెలుగు.. విద్యే పరమార్థం!

**మక్కా నగరంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పెరిగిన కాలంలో అక్కడి సమాజం విగ్రహారాధనలో మునిగిపోయి ఉండేది. కానీ, ముహమ్మద్ ఆలోచనా విధానం భిన్నంగా ఉండేది. సృష్టికర్త ఒక్కడే అని ఆయన బలంగా విశ్వసించారు. నాటి నగర జీవితంలోని కోలాహలానికి, అక్కడి అలవాట్లకు దూరంగా.. ప్రశాంతంగా ఆలోచించుకోవడానికి, ప్రార్థించు కోవడానికి ఆయన తరచూ నగర పొలిమేరల్లోని కొండల్లోకి వెళ్లేవారు.**

అలా ఒకసారి పవిత్ర రమజాన్ మాసంలో, సుమారు 40 ఏళ్ల వయసులో ఆయన 'హిరా' పర్వత గుహలో ధ్యానంలో నిమగ్నమై ఉన్నారు. ఆ సమయంలో అకస్మాత్తుగా జిబ్రయీల్ అనే దైవదూత ప్రత్యక్షమై.. "చదువు!" అని ఆదేశించారు. అప్పటి సమాజంలోని మెజారిటీ ప్రజలలాగే ముహమ్మద్‌కు కూడా అక్షరాస్యత లేదు. దాంతో ఆయన "నాకు చదవడంరాదు" అని సమాధాన మిచ్చారు. దైవదూత రెండోసారి కూడా అదే ఆదేశాన్ని పునరావృతం చేయగా, ప్రవక్త నుంచి అదే సమాధానం వచ్చింది.

మూడోసారి దైవదూత ఆయన్ను చదవమని ఆదేశిస్తూ, దివ్య ఖురాన్‌లోని తొలి వాక్యాలను ఇలా పలికారు:

**"(ఓ ప్రవక్తా) పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు: నీ ప్రభువు పరమ దయాళువు. ఆయన కలం ద్వారా జ్ఞానం నేర్పాడు, మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు.."** (ఖురాన్ 96:1 - 5)

ఆ పవిత్ర వాక్యాలను ముహమ్మద్ హృదయస్థం చేసుకున్నారు. గుహ నుంచి బయటకు వచ్చి నగరం వైపు వేగంగా అడుగులు వేస్తుండగా.. ఆకాశం అంతటా వ్యాపించిన ఒక గంభీరమైన స్వరం, "ఓ ముహమ్మద్! నీవు అల్లాహ్ ప్రవక్తవు, నేను జిబ్రయీల్‌ను" అని పలికింది. ఆ దివ్య అనుభూతికి ఒళ్లంతా వణుకుతుండగా ఆయన ఇంటికి చేరుకుని, తన భార్య ఖదీజాకు జరిగిన వృత్తాంతాన్ని వివరించారు. ఇవే ఇస్లాం పవిత్ర గ్రంథమైన ఖురాన్ అవతరణకు నాంది పలికిన మొదటి అక్షరాలు.

## చదువుతోనే సామాజిక మార్పు

నాటి మక్కా సమాజంలో దాదాపు 300కు పైగా విగ్రహాలను

పూజించేవారు. ఆడపిల్లలను సజీవంగా పూడ్చిపెట్టడం, మితిమీరిన మద్యపానం, కాబా గృహం చుట్టూ దిగంబరంగా తిరగడం వంటి అనేక సామాజిక అరిష్టాలు, దురాచారాలు అక్కడ రాజ్యమేలుతుండేవి. ఆ అంధకారం నుంచి ప్రజలను విముక్తులను చేయడానికి సృష్టికర్త ఎంచుకున్న మొదటి ఆయుధం 'చదువు'. జ్ఞానం ద్వారానే సమాజం అభ్యుదయం వైపు పయనిస్తుందని, అక్షరాస్యతతోనే మూఢనమ్మకాలు నశిస్తాయని ఈ సందేశం స్పష్టం చేసింది. అందుకే, ఖురాన్‌లో సుమారు 800కు పైగా సందర్భాల్లో నేర్చుకోవడం, విద్యాభ్యాసం ప్రాధాన్యత గురించి ప్రస్తావించడం విశేషం.

"జ్ఞానాన్ని ఆర్జించడం అనేది పురుషులకైనా, స్త్రీలకైనా.. ప్రతి ముస్లింపై విధిగా విధించబడిన కనీస బాధ్యత." అని ప్రవక్త ఉద్ఘాటించారు.

### ఆరాధన కంటే బోధన మిన్న!

ఒకరోజు ప్రవక్త ముహమ్మద్ నమాజ్ సమయానికంటే ముందే మసీదులోకి ప్రవేశించారు. అక్కడ రెండు బృందాలు వేర్వేరు పనుల్లో నిమగ్నమై ఉండటాన్ని ఆయన గమనించారు. ఒక బృందం ఖురాన్ పఠిస్తూ, ప్రార్థనలు (దుఆ) చేసుకుంటూ ఆరాధనలో మునిగిపోగా.. మరొక బృందం ఒక మూలన కూర్చుని ఇస్లాం బోధనలను, వాటిని నిత్యజీవితంలో ఎలా ఆచరించాలనే అంశాలపై చర్చిస్తూ, విద్యను అభ్యసిస్తోంది.

ఆ రెండు బృందాలను చూసిన ప్రవక్త.. "ఇరు వర్గాలూ ఉత్తమమైన పనుల్లోనే ఉన్నారు. అయితే, నేను ఒక ఉపాధ్యాయుడిగా పంపబడ్డాను. కాబట్టి నేను నేర్చుకునే వారితోనే చేరతాను" అంటూ విద్యార్థుల బృందం వైపు అడుగులు వేసి, వారితో కలిసి కూర్చున్నారు. జ్ఞానాన్ని అన్వేషించడం కూడా దైవారాధనలో అత్యున్నత భాగమని నిరూపించడానికి ఈ ఘటనే ఒక నిదర్శనం.

### జీవిత సత్యాలు

**నిరంతర అభ్యాసం** : ప్రార్థనల కంటే జ్ఞానార్జనకు ఇస్లాంలో ఉన్నత స్థానం ఉంది. ప్రవక్త ముహమ్మద్ ప్రవచనం ప్రకారం.. "ఒక గంట పాటు జ్ఞానాన్ని ఆర్జించడం, డెబ్బై ఏళ్ల సాధారణ ప్రార్థన కంటే ఎంతో ఉత్తమమైనది. జ్ఞాన మార్గంలో నడిచే వ్యక్తికి స్వర్గ ద్వారాలు సులువవుతాయి."

**సమయం అమూల్యం** : జీవితంలో ప్రతి క్షణాన్ని నేర్చుకోవడానికే కేటాయించాలి. "తొట్టి (పుట్టుక) నుండి సమాధి (మరణం) వరకు నిరంతరం విద్యను అన్వేషిస్తూనే ఉండాలి."

వయసుతో నిమిత్తం లేకుండా సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పడానికి చరిత్రలో ఒక చక్కని ఉదాహరణ ఉంది. చదువుకోని ఒక సాదాసీదా ముస్లిం వ్యక్తికి 60 ఏళ్ల వయసులో ఒక ఆలోచన వచ్చింది. ఒక ఖాళీ కుండలో ఒక్కొక్క నీటి చుక్క పడుతూ.. చివరికి ఆ కుండ నిండిపోయి నీరు పైకి పొర్లడాన్ని ఆయన గమనించాడు. "చిన్న చుక్కలే అంత పెద్ద కుండను నింపగలిగినప్పుడు, నిరంతర సాధనతో నేను మాత్రం జ్ఞానాన్ని ఎందుకు సాధించలేను?" అని అనుకున్నాడు. ఆ వయసులో చదువు ప్రారంభించిన ఆయన, మరణించే నాటికి ఇస్లామిక్ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన పండితుడిగా (స్కాలర్) గుర్తింపు పొందారు.

"నిన్నటి జ్ఞానంతో పోలిస్తే, ఈరోజు కొత్తగా ఏమీ నేర్చుకోకుండా రెండు రోజులను సమానంగా గడిపిన వ్యక్తి ఖచ్చితంగా నష్టపోయినట్లే" అనేది హెచ్చరిక.

నిరంతరం నేర్చుకోవడమే జీవన స్రవంతి. ఈరోజే మీ ప్రయాణాన్ని ప్రారంభించండి, ప్రతి రోజూ కొత్త విషయాలు తెలుసుకోండి, జ్ఞాన శిఖరాలను అధిరోహించండి.

### ఫిఫా వరల్డ్ కప్‌లో ముస్లిం ఆటగాళ్లకు ప్రత్యేక 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు!


ఫిఫా వరల్డ్ కప్ 2026లో ముస్లిం ఆటగాళ్ల మత విశ్వాసాలను గౌరవిస్తూ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాధారణంగా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ట్రోఫీపై మద్యం బ్రాండ్ లోగో ఉంటుంది. అయితే ఇస్లాంలో మద్యం నిషిద్ధమైనందున, అలాంటి ట్రోఫీని స్వీకరించడానికి ఇష్టపడని ముస్లిం ఆటగాళ్ల కోసం బ్రాండ్ లోగో లేని ప్రత్యేక ట్రోఫీని అందిస్తున్నారు.

ఈ ప్రత్యామ్నాయ ట్రోఫీపై ఎలాంటి మద్యం బ్రాండ్ ప్రచారం ఉండదు. దీనికి "సుపీరియర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్" అనే పేరు ఇచ్చారు. ముస్లిం ఆటగాళ్లతో పాటు వయసు తక్కువగా ఉన్న ఆటగాళ్లు కూడా అవసరమైతే ఈ ట్రోఫీని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు.

ఆటగాళ్ల మత విశ్వాసాలను గౌరవిస్తూ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రశంసిస్తున్నారు. క్రీడల్లో ప్రతిభతో పాటు వ్యక్తిగత విశ్వాసాలకు కూడా గౌరవం ఇవ్వడం ఒక సానుకూల పరిణామంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నోటిఫికేషన్ల నడుమ... నిశ్శబ్ద పఠనం!

- నసీరా బేగం



**నిశ్శబ్దంగా ఉంటూనే మనతో మాట్లాడే అద్భుతమైన నేస్తం... పుస్తకం!** ఒంటరితనాన్ని దూరం చేసి, ఓదార్పునిచ్చే నిజమైన స్నేహితుడు పుస్తకమే అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. మనిషికి బాల్యం నుంచే పుస్తకాలతో ఒక విడదీయరాని, పవిత్రమైన అనుబంధం ఏర్పడుతుంది. పసిప్రాయంలో అమ్మ ఒడి నుంచి అక్షరాల లోకంలోకి అడుగుపెట్టిన రోజే తల్లిదండ్రులు మనకు పుస్తకాన్ని పరిచయం చేస్తారు. ఆ పుస్తకాలే కాలక్రమేణా మనకు బతుకు పాఠాలు నేర్పుతాయి, మంచి చెడుల విచక్షణా జ్ఞానాన్ని అందిస్తాయి, వివేకాన్ని పెంచి, రేపటి ఉపాధికి మార్గం చూపుతాయి.

పుస్తక పఠనం మనిషిని ఆపాదమస్తకం మార్చివేస్తుంది; ఒక కొత్త మనిషిగా పునర్జన్మనిస్తుంది. పఠనం వల్ల మనిషి తన అంతరంగాన్ని తాను తొంగి చూసుకోగలడు, బాహ్య ప్రపంచాన్ని సరిగ్గా అవగాహన చేసుకోగలడు. నిరంతరం చదివే అలవాటున్న వాడి హృదయం ఎప్పుడూ జ్ఞాన కాంతితో వెలిగిపోతుంటుంది. జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాల అలల తాకిడికి కొట్టుకు పోకుండా, ధైర్యంగా ఎదురొడ్డి నిలిచే మానసిక శక్తి అతనికి లభిస్తుంది. సమాజంలో తోటివారితో ఎలా మెలగాలో నేర్పుతూనే, సృష్టిలోని రహస్యాలను ఛేదించే దిశగా మనిషిని పుస్తకం నడిపిస్తుంది. అలా ప్రతి రోజూ ఒక కొత్త నేర్చుకుంటూ మనిషి ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేస్తాడు.

పాఠశాలలు, కాలేజీల గోడల మధ్య మనం చదివే పుస్తకాలు మనకు ఒక మహత్తరమైన జ్ఞానాన్ని ఇచ్చి, ఏదో ఒక వృత్తిలో స్థిరపడేలా చేస్తాయి. అయితే, ఉద్యోగం వచ్చి స్థిరపడిపోయాక పుస్తకాలతో బంధం తెగిపోకూడదు. కారుణ్యమూర్తి, మహాప్రవక్త ముహమ్మద్ (స) ఒకచోట ఇలా సెలవిచ్చారు:

**"తల్లి ఒడి నుంచి సమాధి ఒడిలోకి చేరుకునేంతవరకు విద్యను నేర్చుకుంటూనే ఉండండి."**

అంటే, మనిషి తన జీవితాంతం ఒక నిత్య విద్యార్థిగానే సాగిపోవాలని, అనుదినం కొత్త విషయాల అన్వేషణలో జ్ఞానాన్ని పెంచుకుంటూనే ఉండాలని దైవప్రవక్త (స) బోధన సారాంశం.

నిజానికి జ్ఞానం సముద్రమంత వెడల్పు, అంతకంటే లోతైనది. విశ్వమంతా నిండివున్న ఈ జ్ఞాన భాండాగారంలో మనిషి ఎంత సంపాదించుకున్నా, అది సముద్రంలో ఒక చిన్న నీటి బొట్టు లాంటిదే! ఎంత తవ్వినా అంతుచిక్కని మహా నిధి ఇది. కనుక మనిషి స్త్రీ అయినా, పురుషుడైనా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి, దీర్ఘంగా ఆలోచించాలి. అలా సత్యమైన జ్ఞానం కోసం అన్వేషించే వారికి అల్లాహ్ ఎల్లప్పుడూ తోడ్పడతాడు; వారి హృదయ పుటలను తెరిచి, సరైన దిశానిర్దేశం చేస్తాడు.

ఈ సత్యాన్ని తెలుసుకోవాలంటే మనం ఒకసారి చరిత్ర పుటలను తిరగేయాలి. నిన్నటి తరం మహనీయులు, కవులు, రచయితలు, అనువాదకులు తమ జీవితాలను లోతైన అధ్యయనానికే అంకితం చేశారు. వారు సముపార్జించిన జ్ఞానమే గ్రంథాల

రూపంలో నేటికీ మానవజాతిని చక్కదిద్దుతోంది. అటువంటి మహనీయులు ఈనాడు కూడా మన చుట్టూ సమాజంలో కాగడా పట్టిన జ్ఞానదీపాల్లా కనిపిస్తారు. అజ్ఞానపు చీకట్లలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు వారు దివ్యజ్యోతిని అందిస్తారు. అందుకే వారు భౌతికంగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళినా, వారి కీర్తి ప్రతిష్ఠలు విశ్వమంతటా మారుమ్రోగుతూనే ఉంటాయి. అలాంటి వారి కోసం అల్లాహ్ ఒక అద్భుతమైన శుభవార్తనిచ్చాడు- వారు కన్నుమూసినా, వారు విడిచివెళ్లిన జ్ఞానామృతాన్ని సమాజం ఆస్వాదించినంత కాలం, దానికి సంబంధించిన పుణ్యఫలాలు ఆత్మకు అందుతూనే ఉంటాయి.

కానీ, కాలంతో పాటు వేగంగా పరుగెడుతున్న నేటి ఆధునిక సమాజంలో పుస్తక పఠనం క్రమంగా కరువైపోతోంది. యూట్యూబ్, ఇంటర్నెట్ పుణ్యమా అని సమస్త సమాచారం అరచేతిలోకి వచ్చేసింది. ఒకే చోట అన్ని విషయాలు లభిస్తుండటంతో అందరూ డిజిటల్ మాధ్యమాల ద్వారానే సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇది ఒక రకంగా ఎంతో లాభదాయకమైన విషయమే!

కానీ దీని వెనుక ఒక చిన్న చేదు నిజం దాగి ఉంది. అరచేతిలో విశ్వం మొత్తం ఇమిడిపోవడంతో... ఒక పుస్తకం చదువుదామని ఫోన్ తెరిచినా, మనల్ని పక్కదారి పట్టించే వందల నోటిఫికేషన్లు తారసపడతాయి. దీనివల్ల ఒకే విషయంపై ఏకాగ్రత ఉంచడం కష్టమైపోతోంది. ఇంటర్నెట్ అనేది సమాచార సముపార్జనకు చక్కటి సాధనమే, కానీ దానిని వాడుకునేటప్పుడు మనసుపై అదుపు, స్పష్టమైన దృష్టి ఉండాలి. అప్పుడే డిజిటల్ పఠనం వల్ల ఆశించిన ప్రయోజనం దక్కుతుంది.

నిజానికి మనిషి పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని చదివినా, స్మార్ట్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో చదివినా... పఠనం ఎప్పుడూ అమూల్యమైనదే. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి సేకరించిన విజ్ఞాన సర్వస్వాన్ని మనం ఒక పుస్తకం ద్వారా చాలా తేలికగా సొంతం చేసుకోగలుగుతున్నాం. ఇంతటి సువర్ణావకాశాలు ఉన్నప్పటికీ, నేటి తరం పుస్తక పఠనానికి దూరం కావడం నిజంగా బాధాకరం. కొందరికి చదవాలనే ఆశ ఉన్నా, సమయం లేదనో లేదా బద్ధకం వల్లో వాయిదా పడుతూ ఉంటుంది. అలాంటి వారు తమ జీవితంలో పఠనాన్ని ఒక మధురమైన అలవాటుగా మార్చుకోవడానికి కొన్ని చిన్న నియమాలను పాటిస్తే సరిపోతుంది:

## పుస్తక పఠనానికి కొన్ని ప్రేరణాత్మక సూచనలు

**సమయాన్ని కేటాయించండి** : చదవడం ప్రారంభించిన కొత్తలో రోజుకు కేవలం పది లేదా పదిహేను నిమిషాలు మాత్రమే చదవండి. క్రమంగా పుస్తకాలపై ప్రేమ పెరిగి, ఆ ఆనందం అలవాటయ్యాక, మీరే స్వయంగా సమయాన్ని పెంచుకుంటారు. ఒక రోజులో ఒక ప్రత్యేక సమయాన్ని పఠనానికే అంకితం చేస్తే, అది జీవితంలో ఒక భాగమైపోతుంది.

**పుస్తకాన్ని స్నేహితునిగా వెంట ఉంచుకోండి** : ఇల్లు దాటి బయటకు వెళ్లేటప్పుడు బ్యాగులో ఎప్పుడూ ఒక పుస్తకం ఉండేలా చూసుకోండి. ప్రయాణాల్లో ఉన్నప్పుడు, హాస్పిటల్స్ లేదా ఆఫీసుల్లో వేచి చూడాల్సి వచ్చినప్పుడు... ఫోన్ వైపు చూడకుండా పుస్తకం తెరిచి చూడండి. ఆ ఒంటరి క్షణాలు ఎంత అద్భుతంగా గడిచిపోతాయో మీకే తెలుస్తుంది.

**ఒక సుందరమైన పట్టిక (Reading List) తయారు చేసుకోండి:** మంచి పుస్తకాల గురించి మిత్రులను, పెద్దలను అడిగి తెలుసుకుని ఒక డైరీలో రాసుకోండి. ఒక్కో పుస్తకం చదవడం పూర్తి కాగానే దాని పక్కన 'టిక్' పెట్టుకోండి. ఆ పుస్తకంలో మిమ్మల్ని కదిలించిన అద్భుతమైన వాక్యాలను ఒకచోట నోట్ చేసుకోండి.

**ప్రశాంతమైన పఠన కోణాన్ని (Reading Corner) సృష్టించుకోండి:** మీ ఇంట్లో ఒక చిన్న స్థలాన్ని లేదా గదిని మీ పుస్తకాల కోసం కేటాయించండి. పుస్తకాలను అందంగా సర్దుకుని, అనుకూలమైన కుర్చీ వేసుకుని, ప్రశాంతమైన వాతావరణంలో చదవడం వల్ల ఏకాగ్రత అద్భుతంగా కుదురుతుంది.

**పుస్తకాల ప్రపంచంలో విహరించండి** : అప్పుడప్పుడు బుక్ స్టాల్స్‌కు, పుస్తక ప్రదర్శనలకు వెళ్తూ ఉండండి. అక్కడ పుస్తక ప్రేమికులను కలవడం, వేల పుస్తకాల మధ్య నడవడం మనలో చదవాలనే ఆసక్తిని రెట్టింపు చేస్తుంది.

**పిల్లలతో కలిసి చదవండి** : పిల్లల కథల పుస్తకాలను చదవడం వల్ల మన మనస్సు తేలికవుతుంది. ఆ కథలను పిల్లలతో పంచుకుంటూ, వారికి కూడా మంచి పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం ద్వారా రేపటి తరానికి పఠనాసక్తిని వారసత్వంగా అందించవచ్చు.

**సంతోషంగా ఆస్వాదించండి** : చదవడం అనేది ఒక భారం కాదు, అదొక పండగ. ఒక మంచి పని చేస్తున్నామనే తృప్తితో, ఆహ్లాదంగా చదవండి. నచ్చిన కాఫీనో, టీనో తాగుతూ చదవడం ప్రారంభిస్తే ఆ సమయం మరింత ఉల్లాసభరితంగా మారుతుంది.

**అక్షరాన్ని గుండెల్లోకి తీసుకోండి (సమీక్ష)** : పుస్తకం పూర్తయ్యాక దాన్ని అలా పక్కన పడేయకుండా... కాసేపు కళ్లు మూసుకుని ఆలోచించండి. ఆ పుస్తకం మీ మనసుపై ఎలాంటి ముద్ర వేసింది? అందులోని ఏ విషయాలు మీ జీవితాన్ని మార్చబోతున్నాయి? అని ఆత్మపరిశీలన చేసుకోవడమే పఠనానికి లభించే అసలైన సార్థకత.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

29 ఆయత్‌లు మదీనా అవతరణ

# 48. అల్ ఫత్హ్

20 – 21 వెంటనే ఈ విజయాన్నయితే ఆయన మీకు అనుగ్రహించాడు, జనుల చేతులు మీపైకి లేవకుండా ఆపివేశాడు, ఇది విశ్వాసుల కొరకు ఒక సూచన కాగలగాలనీ, అల్లాహ్ మీకు రుజుమార్గం వైపునకు దారి చూపాలనీను.[39] ఇంతేకాక ఇంకా ఇతర ప్రాప్తమయ్యే వాటిని గురించి కూడా ఆయన మీకు వాగ్దానం చేస్తున్నాడు, వాటిపైన మీరు ఇప్పటి వరకూ అధీనం పొందలేదు, అల్లాహ్ వాటిని పరివేష్ఠించి ఉన్నాడు,[40] అల్లాహ్ ప్రతిదానిపైనా అధికారం కలిగి ఉన్నాడు.

22–25 ఈ తిరస్కార జనులు ఈ సమయాన ఒకవేళ నీతో పోరుకు దిగి ఉన్నట్లయితే నిశ్చయంగా వెనుదిరిగి పోయేవారే, మరే సమర్థకుడూ సహాయకుడూ పొందేవారు కారు.[41] ఇది అల్లాహ్ సంప్రదాయం, మునుపటి నుండీ కొనసాగుతోంది,[42] మరి నీవు అల్లాహ్ సంప్రదాయంలో ఎటువంటి మార్పునూ కానలేవు. ఆయనే మక్కా లోయలో వారి చేతుల్ని మీనుండి, మీ చేతుల్ని వారినుండీ (ఎడంగా) ఆపి ఉంచాడు, నిజానికి అప్పటికే ఆయన వారిపైన మీకు ఆధిక్యతను ప్రసాదించే ఉన్నాడు, మీరు చేసేదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు. వారేకదా తిరస్కరించినవారు, మిమ్మల్ని మస్జిదుల్ హరామ్ నుండి ఆపినవారు, "హద్‌యు" ఒంటెల్ని వాటి త్యాగస్థలానికి చేరనివ్వనివారు.[43] ఒకవేళ మీరు ఎరుగనటువంటి విశ్వాసులయిన పురుషులు స్త్రీలు (మక్కాలో) లేకపోయి ఉన్నట్లయితే తెలియకపోయి మీరు వారిని కాలరాస్తారన్న ప్రమాదం లేకపోయినట్లయితే దీనివల్ల మీకు మాట వస్తుందన్న ప్రమాదమూ లేకపోతే (యుద్ధం ఆపడం జరిగేదికాదు. అది ఆపడానికి కారణం) తద్వారా అల్లాహ్ తన కారుణ్యంలో తాను కోరినవారిని ప్రవేశింపజేయాలన్నది. ఆ విశ్వాసులు వేరయిపోయి ఉన్నట్లయితే (మక్కావాసుల్లో) తిరస్కారులయినవారికి మేము ఖచ్చితంగా కఠినశిక్ష విధించేవారము.

39. అంటే మీకు ఇంకా ఇతోధికంగా దూరదృష్టి, దృఢ విశ్వాసం ప్రాప్తమవ్వాలని, భావిలో కూడా మీరు ఇలాగే అల్లాహ్, ఆయన సందేశహరుని విధేయతపైన నిలబడాలని, అల్లాహ్‌పైన నమ్మకముంచి సత్యమార్గాన ముందంజవేస్తూనే పోవాలని దీని ఉద్దేశం. ఇంకా ఈ అనుభవాలు మీకు పాఠం గరపగలగాలి, దైవధర్మం ఏ చర్య తీసుకునే ఆవశ్యకతను కోరుతుందో దేవుని పైన భారం వేసి ఆ చర్య తీసుకోవడం విశ్వాసి బాధ్యత. నా బలమెంత, మిథ్యాశక్తుల బలమెంత అని బేరీజు వేసుకుంటూ, మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చో రాదు.

40. బహుశా ఇది మక్కా విజయానికి సంకేతమయి ఉండ వచ్చు. 'కతాద' అభిప్రాయం కూడా ఇదే. దీనికే ఇబ్ను జరీర్ కూడా ప్రాధాన్యం ఇచ్చారు. దైవం సెలవిచ్చిన దాని భావ మేమని తెలుస్తోందంటే, ఇంకా మక్కా మీ అదుపులోకి రాలేదు. కాని అల్లాహ్ దాన్ని చుట్టుముట్టి ఉంచాడు. హుదైబియాలో లభించిన ఈ విజయం ఫలితంగా అదీ మీ అధీనంలోకి వచ్చేస్తుంది.

41. అంటే, హుదైబియాలో యుద్ధాన్ని అల్లాహ్ ఆపటానికి కారణం అక్కడ మీరు పరాజయం పొందే ఆస్కారముండిం దన్నది కాదు. దాని ఔచితీ విజ్ఞత మరొకటుంది. దాన్ని ముమ్ముందు వస్తున్న ఆయత్‌లలో వివరించడం జరుగుతుంది. ఆ ఔచిత్యం అడ్డుగా రాకపోతే, అల్లాహ్ ఆ ప్రాంతంలో యుద్ధం జరగనిచ్చి ఉన్నట్లయితే నిశ్చయంగా తిరస్కారులకే పరాజయం కలిగేది, మక్కా పుణ్యపురి అప్పుడే మీ వశమయ్యేది.

42. ఇక్కడ 'అల్లాహ్ సంప్రదాయం' అంటే ఉద్దేశం ఏమి టంటే, అల్లాహ్, ఆయన సందేశహరునితో పోరాడే తిరస్కా రుల్ని అల్లాహ్ హైన్యానికీ నైచ్యానికీ గురిచేస్తాడు, తన సందేశ హరునికి సహాయ పడతాడు అన్నది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ التَّفْسِيرِ
## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
(కితాబుత్తఫ్సీర్)

**12. యూసుఫ్ సూరా**

## అన్యాయ వర్తనులు సాఫల్యం పొందలేరు

**అతను (యూసుఫ్) ఉంటున్న ఇంటిలోని స్త్రీ అతని కోసం వల పన్న సాగింది. ఒక రోజున తలుపులు మూసి "వచ్చెయ్యి!" అని అన్నది. యూసుఫ్ ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను. నా ప్రభువు నాకు మంచి స్థానం ప్రసాదించాడు. (నేను ఈ పని ఎలా చెయ్యను?) అటువంటి దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు." *(12: 23)***

**535)** అబూ వాయల్ ఇలా అన్నారు: అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి)పై ఆయత్‌ను పారాయణం చేస్తూ "హైతలక" అని చదివారు. 'హైతలక' అంటే 'రా. వచ్చేసేయ్' అని అర్థం. ఈ పదాన్ని ఇలాగే పలకాలని తమకు నేర్పటం జరిగిందనీ, కనుక తాము ఇలాగే పలుకుతామని ఇబ్నె మస్ఊద్ (రజి) చెప్పారు.

**536)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) మస్రూఖ్‌తో ఇలా అన్నారు: ఖురైషులు దైవప్రవక్త(సఅసమ్)ను విశ్వసించడంలో తాత్సారం చేయడంతో ఆయన(స) వారిని అధిక్షేపిస్తూ ఇలా ప్రార్థించారు: 'దేవా! యూసుఫ్(అ) కాలంలో ఏడు సంవత్సరాల కరువు వచ్చినట్లుగా వీరిపైన కూడా ఏడు సంవత్సరాల కరువు విధించు". ఆ తర్వాత వారిపై ఎటువంటి కరువు వచ్చిపడిందంటే, అంతా సర్వ నాశనమైపోయింది. చివరకు ఖురైషులు ఎముకలను చప్పరించవలసిన దుస్థితి దాపురించింది. వారిలోని ఏ వ్యక్తి అయినా ఆకాశం వైపు దృష్టిని సారిస్తే పొగ మాదిరిగా కానవచ్చేది (ఆకలి మూలంగా నీరసం ఆవహించి అలా అనిపించేది). అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"సరే, స్పష్టమైన పొగను ఆకాశం తీసుకుని వచ్చే దినం కొరకు నిరీక్షించండి. అది ప్రజలను కమ్ముకుంటుంది. ఇదే, వ్యధాభరితమైన శిక్ష."** (అద్ దుఖాన్:10,11) అల్లాహ్ ఇంకా ఈ విధంగా కూడా సెలవిచ్చాడు: **"మేము శిక్షను కొంచెం తొలగిస్తే మీరు పూర్వం చేస్తూ ఉన్న దానినే మళ్ళీ చేస్తారు." *(44:15)***

ఇక్కడ 'శిక్ష' అంటే అర్థం 'కరువు కాటకాల శిక్ష' అని ఇబ్నె మస్ఊద్ (రజి) వ్యాఖ్యానించారు. ఎందుకంటే పరలోక శిక్ష అవిశ్వాసుల నుండి తొలగిపోదు.[1]

*536-1. ఈ హదీసులో దైవప్రవక్త యూసుఫ్(అ) ప్రస్తావన రావటం వల్ల దీనిని ఈ అధ్యాయం క్రింద పొందుపరచవలసి వచ్చింది. ఖుస్తులానీ ప్రకారం మరో ఉల్లేఖనం ఇలా వుంది: ఖురైషులపై కరువు కాటకాలు తీవ్రతరమైనప్పుడు, అబూ సుఫ్యాన్ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి 'తమరు బంధువులను ఆదుకోమని ఆజ్ఞాపిస్తారు కదా! మీ జాతి జనులు ఆకలితో చస్తున్నారు. వారి కొరకు ప్రార్థించండి' అని విన్నవించుకున్నాడు. అప్పుడు ఆయన(స) వారి కోసం ప్రార్థించారు. మహనీయ యూసుఫ్(అ) తన సోదరులను క్షమించినట్లే ఖురైషుల తప్పును క్షమించారు-*

# భారతదేశంలో సమకాలీన సామాజిక సమస్యలు ఇస్లామ్ పరిష్కారం

**- డాక్టర్ సాజిద్ అబ్బాసీ**

**ఇస్లాం అనేది సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ ప్రసాదించిన పరిపూర్ణ జీవన విధానం.** మానవ జీవితానికి సంబంధించిన నైతిక, ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో ఇస్లాం సంపూర్ణ మార్గదర్శ కత్వాన్ని అందిస్తుంది. ఈ సృష్టికి, మానవాళికి సృష్టికర్త అల్లాహ్ ఒక్కడేనని, ఆయనే మానవుడికి సర్వోత్కృష్టమైన జీవన విధానాన్ని ప్రసాదించగలడనేది ఇస్లాం కేంద్ర సిద్ధాంతం. ఎందుకంటే, ఆయనకు మానవ నైజం (స్వభావం) గురించీ, మానవుని బలహీనతల గురించీ సంపూర్ణంగా తెలుసు. మరోవైపు, మానవుని జ్ఞానం పరిమితమైనది; అతని ఆలోచనలు నిరంతరం మారుతున్న పరిస్థితులకు లోబడి ఉంటాయి. అందువల్ల, మానవుడు స్వయంకృషితో ఎన్నటికీ సంపూర్ణ న్యాయాన్ని (సమ తుల్యతను) సాధించలేడు.

మానవ నిర్ణయాలు ఎల్లప్పుడూ అతివాదం లేదా లోటుపాట్ల (అతి-లోటు)తో కూడి ఉంటాయి. కొన్నిసార్లు మనిషి తన అనియంత్రిత ఆకాంక్షల వెంటే పయనించడాన్ని స్వేచ్ఛకు పరాకాష్టగా భావించి, నైతిక హద్దులను చెరిపేస్తాడు. మరికొన్నిసార్లు ఆత్మ ఎదుగుదల కోసమంటూ ప్రాథమిక కోరికలను సైతం అణచివేయాలని తలపోస్తాడు. అందుకే నేటి సమాజంలో ఒకవైపు స్వేచ్ఛా లైంగిక సంబంధాలను నేరంగా పరిగణించని వర్గం ఉంటే, మరోవైపు ఆధ్యాత్మిక ప్రగతికి వివాహ రాహిత్యమే (సన్యాసం) శరణ్యమని నమ్మే వర్గం ఉంది.

ఇస్లాం ఈ రెండు తీవ్రవాద ధోరణుల మధ్య అత్యంత సమతుల్యమైన (మధ్యస్థ) మార్గాన్ని నిర్దేశిస్తుంది. ఇందులో ఒకవైపు దృష్టిని, శీలాన్ని కాపాడుకోవాలని ఆదేశిస్తూనే, మరోవైపు వివాహాన్ని ఒక పవిత్ర మతపరమైన బాధ్యతగా గుర్తించింది. ఈ వివాహ బంధమే ఒక ఆదర్శ కుటుంబ వ్యవస్థకు పునాది వేస్తుంది. ఇస్లాం పురుషుడిపై కుటుంబ ఆర్థిక భారాన్ని మోపగా, స్త్రీని పిల్లల పెంపకం, గృహ నిర్వహణ బాధ్యతలకై ఆర్థిక ఒత్తిళ్ల నుండి విముక్తి చేసింది. ఏ వ్యవస్థకైనా ఇద్దరు నాయకులు ఉండలేనట్లే, ఒకే కుటుంబానికి ఇద్దరు నిర్దేశకులు ఉండటం సంభవించదు. కుటుంబ వ్యవస్థలో క్రమశిక్షణను కాపాడటం కోసం ఇస్లాం పురుషుడిని కుటుంబ పెద్దగా నియమించింది. అయితే, ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా పరస్పర సంప్రదింపులకు, సలహాలకు అత్యున్నత ప్రాధాన్యతనిచ్చింది.

ప్రాచీన కాలంలో పురుషుడు స్త్రీని బానిసగా మార్చి అన్యాయానికి గురిచేశాడు. దానికి తీవ్ర ప్రతిచర్యగా, ఆధునిక కాలంలో స్త్రీ

అటువంటి అనియంత్రిత స్వేచ్ఛను ఆకాంక్షిస్తోంది, దీని ఫలితంగా ఒక ఆదర్శ కుటుంబం ఏర్పడటం, సజావుగా సాగడం అసాధ్యంగా మారుతోంది. కుటుంబ క్రమశిక్షణ కొరకు పురుషుడు ఇంటి పెద్దగా వ్యవహరించడాన్ని నేటి తరం స్త్రీలు అంగీకరించడానికి సిద్ధంగా లేరు. పురుషులతో సమానంగా నిలవడం, వారిలాగే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడమే తన ప్రగతికి పరాకాష్ట అని స్త్రీ భావిస్తోంది. వాస్తవానికి, మానవజాతి సముద్ధరణ కోసము, పిల్లల సత్ప్రవర్తనతో కూడిన పెంపకం కోసం ఆమెను ఆర్థిక జవాబుదారీ తనం నుండి మినహాయించడం జరిగింది. కానీ నేడు ఆమె ఆర్థిక స్వాతంత్ర్యం పేరిట తన ప్రాథమిక బాధ్యతలను విస్మరిస్తోంది. దీనివల్ల ఆమె అటు పురుషుడిగా మారలేకపోయింది, ఇటు స్త్రీత్వపు విశిష్టతను కాపాడుకోలేకపోతోంది.

సామాజిక పరంగా ఇస్లాం వ్యక్తిగత ఆస్తి హక్కును గుర్తిస్తుంది, కానీ ఆ సంపద అపరిమితంగా, అదుపులేకుండా పెరిగిపోవడాన్ని నిషేధిస్తుంది. ఒకవైపు పెట్టుబడిదారీ విధానం (Capitalism) ఉంది, అక్కడ సంపద కొద్దిమంది హస్తాల్లోనే కేంద్రీకృతమవుతుంది. మరోవైపు, వ్యక్తిగత ఆస్తి హక్కును పూర్తిగా హరిస్తూ సామ్యవాద విధానం (Communism) అవతరించింది, ఇది మనిషి శ్రమించి ప్రగతి సాధించాలనే ఉత్సాహాన్నే చిదిమేసింది. ఈ విధంగా మానవాళి తీవ్రమైన హెచ్చుతగ్గుల మధ్య కొట్టుమిట్టాడుతూ, సమతుల్యతకు దూరమైంది. ఇస్లాం మాత్రమే ఇటువంటి సమతుల్య జీవన విధానపు ఆవశ్యకతను నెరవేరుస్తుంది. ఇస్లామీయ బోధనలను విశ్లేషిస్తే, ఇస్లాం మానవ స్వభావానికి అత్యంత అనుగుణమైనదని, మానవుని సమగ్ర వికాసానికి, ఆత్మశుద్ధికి అది పూచీకత్తుగా నిలుస్తుందని స్పష్టమవుతుంది.

ప్రస్తుత ప్రపంచం అసంఖ్యాకమైన సవాళ్లను, సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ వ్యాస పరంపర ద్వారా ఆయా సమస్యలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నంలో భాగంగా ప్రచురితమవుతున్న తొలి భాగం ఇది. ఈ శీర్షిక కింద చర్చించబోయే ప్రధానాంశాలు:

➢ లక్ష్యం లేని జీవితం, విడాకుల ఉధృతి, వైవాహిక జీవితంలో నమ్మకద్రోహం, అక్రమ సంబంధాలు.

➢ లంచగొండితనం, అవినీతి, అంధానుకరణ, కుల వివక్ష, సామాజిక హెచ్చుతగ్గుల వ్యవస్థ, వరకట్న శాపం, ఆడపిల్లల భ్రూణహత్యలు, ద్వేషపూరిత రాజకీయాలు, మద్యం, మత్తు పదార్థాల మహమ్మారి, వడ్డీ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, విద్యా రంగంలో సంక్షోభం, వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం- వృద్ధాశ్రమాల పెరుగుదల, అనాథలు, నిరాశ్రయులైన పిల్లల సమస్యలు, పర్యావరణ వినాశనం, ప్రసార మాధ్యమాల (మీడియా) ప్రతికూల పాత్ర, మహిళలపై హింస, న్యాయవ్యవస్థలో జాప్యం, ప్రజారోగ్య సవాళ్లు, భావప్రకటన స్వేచ్ఛ

## 1. లక్ష్యం లేని జీవితం, ఆధ్యాత్మిక శూన్యత

ఆధునిక ప్రపంచంలో అపారమైన భౌతిక ప్రగతి, సాంకేతిక విప్లవం, సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ, నేటి మానవుడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభం లక్ష్యం లేని జీవితం' (Purposelessness). కేవలం ఆర్థిక సమృద్ధి మాత్రమే మనిషికి మానసిక ప్రశాంతతను చేకూర్చలేదని ప్రస్తుత మానసిక, సామాజిక, వైద్య రంగ నిపుణులు సైతం ఏకాభిప్రాయంతో అంగీకరిస్తున్నారు. మానవ చరిత్రలో మున్నెన్నడూ లేనంతటి భౌతిక ప్రగతిని ఈ ఇరవై ఒకటో శతాబ్దం చవిచూసింది. మానవుడు కృత్రిమ మేధస్సును (Artificial Intelligence) ఆవిష్కరించాడు, అంతర్జాలం (Internet) ద్వారా ప్రపంచాన్ని ఒక చిన్న గ్రామంగా మార్చేశాడు, ప్రాణాంతక వ్యాధులకు చికిత్సలను కనుగొన్నాడు, లెక్కలేనన్ని విలాసాలను సమకూర్చుకున్నాడు. అయితే, ఇంతటి విస్మయకరమైన పురోగతి సాధించినప్పటికీ, నేటి మానవుడు గతంలో కంటే ఎంతో వ్యాకులతతో, ఆందోళనతో, నిరాశతో, ఒంటరితనంతో కొట్టుమిట్టాడుతున్నాడు.

ఇది కేవలం ఆర్థిక శాస్త్రం ద్వారానో లేదా వైద్య రంగం ద్వారానో విశ్లేషించలేని ఒక తీవ్రమైన విషాదం. ఇక్కడి అసలు సమస్య మానవ ఆత్మకు సంబంధించినది. మానవుడు అంటే కేవలం మాంసం, ఎముకలు, నరాల సమూహం మాత్రమే కాదు; అంతకు మించిన ఒక ఆధ్యాత్మిక ఉనికి. శరీరానికి ఆహారం ఎలాగో, మేధస్సుకు జ్ఞానం ఎలాగో, ఆత్మకు తన సృష్టికర్తతో గల సంబంధం కూడా అలాగే పరమావశ్యం. మానవ ఆత్మ ఆ ఆధ్యాత్మిక ఆహారానికి దూరమైనప్పుడు, బాహ్యంగా ఎన్ని భోగభాగ్యాలు ఉన్నప్పటికీ అంతర్గతంగా మనశ్శాంతి లభించదు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సంక్షోభం నిరంతరం తీవ్రరూపం దాల్చుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 28 కోట్ల మంది ప్రజలు తీవ్ర మానసిక కుంగుబాటు (Depression) బారిన పడ్డారు. 30 కోట్లకు పైగా జనాభా ఆందోళన పూరిత (Anxiety) మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ప్రతి ఏటా సుమారు ఏడు లక్షల కంటే ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే, ఆధునిక నాగరికత తన భౌతిక వైభవంతో మానవుడికి బాహ్య సౌకర్యాలను కల్పించగలిగిందే కానీ, అంతర్గత ప్రశాంతతను ప్రసాదించడంలో

పూర్తిగా విఫలమైందని స్పష్టమవుతోంది. అదేవిధంగా, పలు అంతర్జాతీయ సర్వే నివేదికల ప్రకారం, ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాలలో సైతం ఒంటరితనం, మానసిక ఒత్తిళ్ల నివారణకై 'యాంటీ డిప్రెసెంట్' (Anti-depressant) ఔషధాల వినియోగం విపరీతంగా పెరిగింది. సంపద, విలాసాలు మాత్రమే మనిషి సమగ్ర అవసరాలను తీర్చలేవనే నిష్ఠుర సత్యానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం.

## ఇస్లామీయ పరిష్కారం

పవిత్ర ఖురాన్ మానవుడిని కేవలం ఒక భౌతిక శరీరంగా మాత్రమే కాకుండా, ఆత్మ, శరీరాల సమాహారంగా నిర్దేశిస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"నేను అతణ్ణి పూర్తిగా తయారుచేసి, అతనిలో నా ఆత్మను కొద్దిగా ఊదినప్పుడు..."(సూరా అల్-హిజ్ర్: 29)

ఈ 'ఆత్మ' మానవుడిని కేవలం ఒక జంతువులా మిగిలిపోనివ్వదు; అది మనిషి నుండి ఉన్నత నైతికత, ప్రేమ, త్యాగం, ఆరాధన, జీవితానికి ఒక మహోన్నత లక్ష్యాన్ని డిమాండ్ చేస్తుంది. మానవునికి లభించే నిజమైన మనశ్శాంతికి ఏకైక మార్గం-సృష్టికర్తతో అతనికి గల అనుబంధం మాత్రమే. అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"తెలుసుకోండి! అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తిని పొందే భాగ్యం లభిస్తుంది." (సూరా అర్-రాద్: 28)

ఈ ఆయత్ (వాక్యం) ఒక మహోన్నతమైన మానసిక సత్యాన్ని ఆవిష్కరిస్తోంది. మానవునికి జీవితంలో ఎన్నడూ దుఃఖం గానీ, ఆందోళన గానీ కలగవని ఖురాన్ చెప్పడం లేదు; ఆయా కష్టనష్టాలు ఎదురైనప్పటికీ, అల్లాహ్‌తో ఉన్న దృఢమైన సంబంధం వల్ల హృదయానికి నిశ్చలమైన శాంతి లభిస్తుందని నొక్కి చెబుతోంది. ఇదే సత్యాన్ని మరో సందర్భంలో ఇలా హెచ్చరించాడు:

"నా జ్ఞాపికకు (హితోపదేశం) విముఖుడైన వానికి ప్రపంచంలో జీవితం ఇరుకవుతుంది." (సూరా తాహా: 124)

ఇక్కడి 'సంకుచితత్వం' లేదా ఇరుకుదనం అనేది కేవలం ఆర్థిక పరమైనది మాత్రమే కాదు; అది హృదయ వైకల్యం, ఆధ్యాత్మిక అశాంతి, జీవితంలో వ్యర్థతా భావనను కూడా సూచిస్తుంది. ఒకవేళ మానవ ఆత్మ అల్లాహ్‌తో ముడిపడి ఉంటే, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అతనికి అంతర్గత తృప్తి, హృదయ శాంతి లభిస్తాయి.

## జీవిత పరమార్థం ఏమిటి?

ఖురాన్ మానవాళికి వారి సృష్టి వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని స్పష్టం చేస్తోంది:

"నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరి దేని కొరకూ సృష్టించలేదు." (అజ్-జారియాత్: 56)

ఆరాధన (ఇబాదత్) ప్రథమ సోపానం 'అల్లాహ్ జ్ఞానం' (మఅరిఫత్)- అనగా ఈ సృష్టిలోని ఆయన అద్భుత నిదర్శనాలను వీక్షించి ఆయన ఉనికిని గుర్తించడం. రెండవ సోపానం- మన సర్వ ఆలోచనలకు, ప్రేమకు కేంద్ర బిందువుగా అల్లాహ్‌ను నిలుపుకోవడం. మూడవ సోపానం- ఆయనకు సంపూర్ణంగా విధేయత చూపడం. ఆరాధన అంటే కేవలం నమాజ్, ఉపవాసాలు మాత్రమే కావు; మానవ జీవితంలోని ప్రతి క్షణాన్ని దైవేచ్ఛకు అనుగుణంగా గడపడమే నిజమైన ఆరాధన. తన జననం ఒక యాదృచ్ఛిక ప్రమాదం కాదని, ఒక నిర్దిష్ట ఉన్నత లక్ష్యం కోసమే తాను సృష్టించబడ్డానని మనిషి గ్రహించినప్పుడు, అతని సమగ్ర జీవితం అర్థవంతంగా మారుతుంది.

## సంపద మనశ్శాంతిని ఎందుకు ఇవ్వలేదు?

పవిత్ర ఖురాన్ బోధిస్తోంది: "ఈ సంపదా, ఈ సంతానమూ కేవలం ఐహిక జీవితపు తాత్కాలిక అలంకారాలు మాత్రమే." (సూరా అల్-కహఫ్: 46)

ఖురాన్ వాటిని 'అలంకారాలు' అన్నదే కానీ, జీవిత పరమార్థం అనలేదు. అయితే, ఆధునిక సమాజం ఆ బాహ్య అలంకారాన్నే జీవిత ధ్యేయంగా మార్చుకుంది. అపారమైన ధనసంపద, భోగభాగ్యాలు, కీర్తిప్రతిష్టల వల్లే అమితమైన ఆనందం, ప్రశాంతత లభిస్తాయని ప్రజలు భ్రమిస్తున్నారు. కానీ వాస్తవం దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది. సంపదే గనుక ప్రశాంతతకు మూలమైతే, ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాలలో మానసిక కుంగుబాటు (డిప్రెషన్), ఆత్మహత్యల రేటు ఇంత ఆందోళనకరంగా ఉండేది కాదు.

మానవుడు తన సృష్టికర్తకు దూరమైనప్పుడు, అతని

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అంతరంగంలో ఏర్పడే ఆ ఆధ్యాత్మిక శూన్యతను పూరించడానికి భిన్నమైన మార్గాలను అన్వేషిస్తాడు. అందుకోసమే మత్తు పదార్థాలు, మద్యం, అశ్లీలత, జూదం, ఉద్దేశ్యరహిత వినోదాలు, సోషల్ మీడియా వ్యసనం, నిద్రమాత్రలు, యాంటీ డిప్రెసెంట్ ఔషధాలపై విపరీతంగా ఆధారపడుతున్నాడు. ఇవన్నీ తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తాయేమో కానీ, దీర్ఘకాలంలో స్థిరమైన అశాంతికి, ఆందోళనలకు కారణమవుతాయి.

దీనికి ఇస్లాం చూపే ఏకైక పరిష్కారం- నిజమైన సృష్టికర్త, యజమాని, పోషకుడైన అల్లాహ్‌తో మానవుడు అనుసంధానం కావడం. అల్లాహ్‌తో ఏర్పడే ఈ బంధం ఊహాగానాలపై కాక, అచంచలమైన నమ్మకం (యకీన్) పై ఆధారపడి ఉండాలి. హేతుబద్ధమైన ఆధారాలతో లభించే విశ్వాసం (ఈమాన్) అత్యంత శక్తివంతమైనదిగా, అచంచలమైనదిగా ఉంటుంది. కేవలం అపోహలు, అంచనాల ఆధారంగా నకిలీ దేవుళ్లను ఆరాధిస్తూ ప్రశాంతతను అన్వేషిస్తున్నామని చెప్పుకునే వారు సైతం అంతర్గతంగా నిరంతరం అశాంతితోనే రగిలిపోతుంటారు. ఎందుకంటే అవిశ్వాసానికి (కుఫ్ర్), బహు దైవారాధనకు (షిర్క్) ఎలాంటి తార్కిక ఆధారాలు లేవు. అల్లాహ్ ఇలా అంటున్నాడు:

"ఎవడైనా అల్లాహ్‌తో పాటు మరొక ఆరాధ్యుణ్ణి వేడుకుంటే, దానికి అతని వద్ద ఏ ప్రమాణమూ లేదు." (అల్-ముఅమినూన్: 117)

ఎటువంటి ఆధారం లేని చోట దృఢ విశ్వాసం ఎలా సాధ్యమవుతుంది? అందుకే, అవిశ్వాసం లేదా బహుదైవారాధన ద్వారా హృదయ శాంతి లభిస్తుందనే వాదన కేవలం ఒక అపోహ మాత్రమే.

దాసుడిని తన సృష్టికర్తతో అనుసంధానించే అత్యున్నత ఆరాధన 'నమాజ్'. నమాజ్ మనిషిని రోజుకు ఐదు సార్లు తన ప్రభువుతో ముడిపెడుతుంది. ఇది కేవలం ఒక ఆచారం కాదు, ఆత్మకు లభించే 'ఆధ్యాత్మిక పునరుజ్జీవనం' (Spiritual Renewal). నమాజ్ అనేది నిజానికి ఆత్మకు లభించే పౌష్టికాహారం. అల్లాహ్ ఆజ్ఞాపించాడు:

"నా జ్ఞాపకం కోసం నమాజును స్థాపించు." (సూరా తాహా: 14)

అందుకే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి ఎలాంటి కష్టం లేదా ఆందోళన ఎదురైనా, ఆయన వెంటనే నమాజ్ వైపునకు మొగ్గు చూపేవారు.

మానవుడు 'దుఆ' (ప్రార్థన) ద్వారా కూడా తన ప్రభువుతో నేరుగా కనెక్ట్ అవుతాడు. ఏ కష్టం వచ్చినా అతడు అల్లాహ్‌ను వేడుకుంటాడు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా అల్లాహ్ తన ప్రార్థనను నేరుగా ఆలకిస్తాడనే అమితమైన నమ్మకం అతనికి ఉంటుంది. అతడు అల్లాహ్ పైనే భారం వేస్తాడు (తవక్కుల్). దైవజ్ఞానంపై, ఆయన హేతుబద్ధతపై పరిపూర్ణ విశ్వాసం ఉంచుతాడు; దేవుని ప్రతి నిర్ణయం వెనుక ఒక నిగూఢమైన మేలు దాగి ఉంటుందని నమ్ముతాడు. ఈ లోకం ఒక పరీక్షా స్థలమని, ప్రతి విపత్తు తన వ్యక్తిత్వ వికాసానికి ఒక సాధనమని, ఓర్పు (సబర్) వహించడం ద్వారా తన ఆధ్యాత్మిక స్థాయి పెరుగుతుందని ఒక విశ్వాసికి తెలుసు. పరలోక జీవితం (ఆఖిరత్) పై ఉన్న నమ్మకం అతడిని ఎల్లప్పుడూ ఆశావాదంతో నింపుతుంది. పవిత్ర ఖురాన్ పఠనం కూడా అల్లాహ్‌తో సజీవ సంబంధాన్ని పెంపొందించే ముఖ్యమైన సాధనం.

అల్లాహ్ పై విశ్వాసం, పరలోక నమ్మకం, నమాజ్, ప్రార్థన, ఖురాన్ పఠనం, దైవస్మరణ, ఓర్పు, కృతజ్ఞత, సమాజ సేవ, హలాల్ (ధర్మబద్ధమైన) సంపాదన, సత్ప్రవర్తన- ఈ విలువలన్నీ కలిసి మానవుడిని శారీరక, మానసిక, నైతిక, ఆధ్యాత్మిక రంగాలలో ఒక సమతుల్యమైన (పరిపూర్ణ) వ్యక్తిత్వంగా తీర్చిదిద్దుతాయి.

నేడు మానవాళి ఎదుర్కొంటున్న అతి పెద్ద సంక్షోభం ఆర్థిక పరమైనది కాదు, ఆధ్యాత్మికపరమైనది. మనిషి భూగోళాన్ని జయించాడు కానీ, తన స్వంత హృదయాన్ని మాత్రం ముక్కలు చేసుకున్నాడు. అతడు అణువును విచ్ఛిన్నం చేయగలిగాడు కానీ, తన అంతర్గత అశాంతిని దూరం చేసుకోలేకపోయాడు. అతడు కృత్రిమ మేధస్సును సృష్టించాడు కానీ, జీవిత పరమార్థాన్ని కోల్పోయాడు.

ఈ విశ్వంలో మానవుడు లక్ష్యరహితంగా రాలేదని ఖురాన్ అతనికి గుర్తుచేస్తోంది. అతనికి ఒక సృష్టికర్త ఉన్నాడు, ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది, పరలోకమే అతని శాశ్వత గమ్యస్థానం. మనిషి తన ప్రభువును గుర్తించినప్పుడు, జీవితంలోని దుఃఖాలు, కష్టాలు, పరీక్షలు కూడా అర్థవంతంగా మారుతాయి. ఈ దివ్య అనుబంధం ద్వారానే హృదయానికి ఆ అపారమైన శాంతి లభిస్తుంది; దానిని అటు సంపదతో గానీ, ఇటు కీర్తి ప్రతిష్టలు, అధికారం లేదా భౌతిక విలాసాలతో గానీ కొనుగోలు చేయలేము. ఇదే పవిత్ర ఖురాన్ సందేశం, ఇదే ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి పిలుపు, ఇదే నేటి అశాంతి నిండిన మానవాళికి అత్యంత ఆవశ్యకమైన తక్షణ అవసరం.

**(మిగతా వచ్చేవారం)**




**- డాక్టర్ కుతుబ్ ఉద్దీన్,**
**మానసిక వైద్య నిపుణులు, USA**

**మానసిక ఆందోళన లేదా 'యాంగ్జయిటీ' (Anxiety) అనేది నేడు ప్రపంచ వ్యాప్తంగా అసంఖ్యాక ప్రజలను పీడిస్తున్న ఒక సంక్లిష్టమైన మానసిక రుగ్మత.** ప్రతి వ్యక్తి తన జీవితంలోని ఏదో ఒక దశలో స్వల్పంగా ఆందోళనకు గురికావడం సహజం. అయితే, ఒక వ్యక్తి ఏదైనా ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పుడు లేదా తీవ్రమైన ఒత్తిడికి లోనైనప్పుడు, వారి మెదడు 'ఎడ్రినాలిన్' వంటి హార్మోన్లను విడుదల చేస్తుంది. ఇది శరీరాన్ని 'పోరాడు లేదా పారిపో' (Fight-or-Flight) అనే స్థితికి సిద్ధం చేస్తుంది. ఇటువంటి ప్రతిస్పందన మనిషి ప్రాణ రక్షణకు సహకరిస్తుంది. కానీ, ఈ ఆందోళన సందర్భోచితంగా కాకుండా, నిరంతరాయంగా ఒక వ్యక్తిని వెంటాడితే, అది గంభీరమైన 'ఎంగ్జయిటీ డిజార్డర్'గా పరిణమిస్తుంది.

## రుగ్మత యొక్క తీవ్రత, స్వభావం

సహజమైన ఆందోళనకు, యాంగ్జయిటీ డిజార్డర్‌కు మధ్య గల అంతరం చాలా స్పష్టమైనది. ఒక వ్యక్తిలో ఆందోళన తీవ్రత, వారిని ఎదుర్కొంటున్న పరిస్థితుల కంటే అధికంగా ఉండి, అది వారి నియంత్రణలోకి రానప్పుడు అది ఒక వ్యాధిగా మారుతుంది. ఈ రుగ్మత వ్యక్తి యొక్క జీవన ప్రమాణాలను, వృత్తిపరమైన బాధ్యతలను మరియు సామాజిక సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇది కేవలం ఒక వ్యక్తిగత బలహీనత కాదు; ఇది మధుమేహం , రక్తపోటు వలె చికిత్స అవసరమయ్యే ఒక వైద్యపరమైన స్థితి.

## ప్రధాన రకాలు, వాటి స్వరూపం

యాంగ్జయిటీ డిజార్డర్ అనేది ఒక విస్తృతమైన రుగ్మతా సమూహం. దీనిలో ప్రధానమైనవి:

**జనరలైజ్డ్ ఎంగ్జయిటీ డిజార్డర్** (GAD) : ఆరోగ్యం, పని, కుటుంబం వంటి రోజువారీ అంశాల పట్ల ఆరు నెలలకు పైగా కొనసాగే నిరంతర ఆందోళన. దీనికి ఎటువంటి స్పష్టమైన కారణం లేకపోయినా, వ్యక్తి నిరంతరం భయాందోళనలకు లోనవుతుంటాడు.

**పానిక్ డిజార్డర్** (Panic Disorder) : ఎటువంటి ప్రాథమిక హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా దాడి చేసే 'పానిక్ అటాక్స్'. ఇవి తీవ్రమైన భయాన్ని కలిగిస్తాయి.

**సోషల్ ఎంగ్జయిటీ డిజార్డర్** : ఇతరుల ముందు అవమానానికి గురవుతామనే భయంతో సామాజిక సంబంధాలకు దూరంగా ఉండటం.

**స్పెసిఫిక్ ఫోబియాస్ , అగోరాఫోబియా** : కొన్ని నిర్దిష్ట వస్తువుల పట్ల లేదా బయట ప్రదేశాలకు వెళ్లడం పట్ల కలిగే అహేతుక భయాలు.

## లక్షణాలు - శారీరక, మానసిక ప్రభావం

ఈ రుగ్మత ప్రభావం కేవలం మెదడుకే పరిమితం కాదు; ఇది శరీర వ్యవస్థలన్నింటినీ చిన్నాభిన్నం చేస్తుంది.

**మానసిక లక్షణాలు** : ఏకాగ్రత లోపించడం, నిరంతర నిద్రలేమి, భవిష్యత్తు గురించి అతిగా ఆందోళన చెందడం, మనస్సు ఎప్పుడూ ఒక రకమైన అశాంతితో ఉండటం.

**శారీరక లక్షణాలు** : గుండె వేగంగా కొట్టుకోవడం, నిరంతర కండరాల బిగువు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జీర్ణకోశ సమస్యలు, తీవ్రమైన అలసట , వణుకు.

ఈ లక్షణాలు కేవలం ఊహాజనితమైనవి కావు. దీర్ఘకాలిక ఒత్తిడికి శరీరం చూపే ప్రతిచర్యలు ఇవి. సరైన వైద్య సలహా మరియు చికిత్స ద్వారా ఈ గంభీరమైన స్థితి నుండి బయటపడటం సాధ్యమవుతుంది. ఎంగ్జయిటీ డిజార్డర్‌ను అశ్రద్ధ చేయడం వల్ల భవిష్యత్తులో ఇతర తీవ్రమైన మానసిక వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. కావున, దీనిని వైద్యపరంగా గుర్తించి చికిత్స అందించడం అత్యంత ఆవశ్యకం.

# సిగ్గే బంగారం

- వసీమున్నీసా

"హయా హై తో హై ఈమాన్ కీ సలామతీ, హయా నహీ తో కుచ్ భీ నహీ జిందగీ మే బాకీ."

**భావం :** హృదయంలో 'హయా' (సిగ్గు) ఉంటేనే విశ్వాసానికి, వ్యక్తిత్వానికి రక్షణ ఉంటుంది. ఆ సంకోచమే లేనప్పుడు జీవితంలో ఇక పవిత్రమైనది ఏదీ మిగలదు.

ఆధునిక సమాజం దేనిని ఆధునికత అని భ్రమిస్తోందో, అదే నేడు మానవత్వానికి పాతర వేస్తోంది. మనిషి వ్యక్తిత్వం అద్దంలో ప్రతిబింబించే బాహ్య సౌందర్యం కాదు, అంతరాత్మలోని నైతిక సంకోచం. ఆ సంకోచమే 'హయా'. నేటి డిజిటల్ యుగంలో ఈ పదాన్ని చాలామంది 'బిడియం' అని, 'పాతకాలపు మొహమాటం' అని కొట్టిపారేస్తున్నారు. కానీ, నిజానికి 'హయా' అనేది మనిషిని పశుప్రవృత్తి నుండి కాపాడే ఒక బలమైన ఆత్మరక్షక కవచం.

## హెచ్చరికగా మారిన ప్రవచనం

"ఖుబీ-ఎ-ఇన్సాన్ తో హై ఉస్ కీ హయా మే, మిట్ జాయే జో యే, తో క్యా రహా ఇన్సాన్ మే?"

**భావం :** మనిషి అసలైన అందం, గొప్పతనం అతనిలోని నైతిక సంకోచం (హయా) లోనే ఉంది. ఒకవేళ అదే నశించిపోతే, ఇక ఆ మనిషిలో మానవత్వం ఎక్కడ మిగులుతుంది?

**ప్రవక్త మహమ్మద్ (స) ప్రవచించిన ఒక మహత్తర వాక్యం :** "నీకు సిగ్గు లేకపోతే, నీకు నచ్చినది చేయి." ఇది అనుమతి కాదు, ఒక తీవ్రమైన హెచ్చరిక. మనిషి హృదయంలో 'హయా' అనే దీపం ఆరిపోయినప్పుడు, అదుపు చేసే ఆంతరంగిక శక్తి ఉండదు. ఎప్పుడైతే ఆ హద్దులు చెరిగిపోతాయో, మనిషి అగాధంలోకి జారుకుంటాడు. తనను తాను అదుపు చేసుకోలేని వాడు, సమాజంలో అత్యంత ప్రమాదకరమైన మనిషిగా మారుతాడు.

## రీల్స్ మాయాజాలం - బజారున పడ్డ వ్యక్తిత్వం

"చంద్ లైకోం కీ ఖాతిర్ బజార్ మే ఆ గయే, హుస్న్ కో అప్నే నుమాయిష్ బనా గయే!"

**భావం :** నాలుగు లైకులు, వ్యూస్ కోసం కొందరు తమను తాము బజారున పెట్టేసుకుంటున్నారు. పవిత్రంగా దాచుకోవాల్సిన వ్యక్తిగత జీవితాన్ని, అందాన్ని నలుగురి ముందు ప్రదర్శన వస్తువుగా మార్చేస్తున్నారు.

నేడు సోషల్ మీడియాలో 'రీల్స్' చేస్తున్న విన్యాసాలు చూస్తుంటే, ఒక నాగరిక సమాజం ఏ దిశగా వెళ్తోందో అన్న భయం కలుగు తోంది. ఒకప్పుడు పవిత్రమైన వ్యక్తిగత జీవితం, ఇప్పుడు కేవలం 'కంటెంట్'గా మారిపోయింది. లైకుల కోసం, వ్యూస్ కోసం శరీరాన్ని ప్రదర్శించడం, వ్యక్తిగత పడకగది విషయాలను కూడా నలుగురి ముందు ఉంచడం... ఇవన్నీ చూస్తుంటే అసలు మనిషికి 'హయా' మిగిలి ఉందా? అనిపిస్తుంది.

'బోల్డ్' కంటెంట్, 'గ్లామరస్' రీల్స్ పేరుతో అశ్లీలాన్ని భుజానకెత్తు కుని, అది స్వేచ్ఛ అని భ్రమపడుతున్నాం. గతంలో గడప దాటని విషయాలు, ఇప్పుడు ప్రపంచానికి విందుగా మారుతున్నాయి. అశ్లీలాన్ని ఆవిష్కరించడం, అసభ్యతను ప్రదర్శించడం 'గొప్ప' అని భావించే స్థాయికి నేటితరం దిగజారడం బాధాకరం. బట్టల హద్దులను చెరిపేయడం, సంస్కారాన్ని కించపరచడం 'ట్రెండ్' అని పిలుచుకోవడం, మన సంస్కృతికి పట్టిన దౌర్భాగ్యం.

## హయా - ఒక జీవన విధానం

'హయా' అనేది కేవలం బట్టలకు సంబంధించినది కాదు, అది మనిషి ప్రవర్తనకు సంబంధించినది. కళ్లలో నైతిక సంకోచం ఉన్నప్పుడే, మనల్ని ఎవరో గమనిస్తున్నారనే దైవచింతన వ్యక్తమవుతుంది.

'హయా' అంటే కేవలం ముఖం చాటేసుకోవడం కాదు. అది ఒక క్రమశిక్షణ. మన కళ్లు దేనిని చూస్తున్నాయి, మన నోరు దేనిని పలుకుతోంది, మన చేతులు దేనిని సృష్టిస్తున్నాయి అనే దానిపై ఒక నియంత్రణ ఉండాలి. మనల్ని ఎవరూ చూడనప్పుడు కూడా, మనల్ని గమనించే ఒక శక్తి ఉందన్న స్పృహ కలిగి ఉండటమే నిజమైన హయా.

ప్రవక్త అత్యంత సున్నితమైన మనస్తత్వం కలిగిన వారు, కానీ సత్యం మాట్లాడేటప్పుడు గర్జించే సింహంలా ఉండేవారు. వారి నైతికత, వారి సిగ్గు వారిని ఎప్పుడూ బలహీనులను చేయలేదు, పైగా గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టింది.

నేడు ప్రపంచం మనకు స్వేచ్ఛ పేరిట అశ్లీలతను పరిచయం చేస్తోంది. కానీ నిజమైన స్వేచ్ఛ అంటే కోరినది చేయడం కాదు, చేయకూడనిది తెలిసి కూడా నిగ్రహించుకోవడం. రీల్స్ వెనుక ఉన్న కృత్రిమ సంతోషాన్ని వదిలి, మన హుందాతనాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. సిగ్గును కోల్పోవడం అంటే మనిషి తన మనుగడనే కోల్పోవడమే.

అద్దం ముందు నిలబడి సెల్ఫీలు తీసుకునే ముందు, మనలోని అంతరాత్మను ఒక్కసారి ప్రశ్నించుకుందాం: "నేను చూపిస్తున్న ఈ ప్రదర్శన, నా హుందాతనాన్ని పెంచుతోందా లేక నా సంస్కారాన్ని దిగజారుస్తోందా?" సమాధానం మనలోనే ఉంది. మన విలువను మనం కాపాడుకుందాం, 'హయా'ను మన ఆభరణంగా మలచుకుందాం.

## ఆలోచించండి... మీ హుందాతనం మీ చేతుల్లోనే ఉంది!

"హయా నహీ హై జమానే కీ ఆంఖో మే బాకీ, రహీ నా "షరమ్, నా వఫా అబ్ కైసీ హై యే సాఖీ హుందాతనాన్ని మరిచి, అశ్లీలతనే ట్రెండ్ అనుకుంటున్నారు, సంస్కారాన్ని వదిలి, కృత్రిమ వెలుగుల్లో మునిగిపోతున్నారు."

❖

# పచ్చని సంతకం చేద్దాం!

**తహూరా సిద్దీఖా**



**నలువైపులా ప్రకృతి దృశ్యాలు ఎంతో మనోహరంగా ఉన్నాయి,**
**నేల మౌనంగా ఉన్నా, అది పచ్చని పాటలను పాడుతోంది!**
**ఈ చెట్లు, ఈ పచ్చదనం, ఈ చల్లని గాలి..**
**ఇవన్నీ ఆ దేవుడి కరుణకు సజీవ సాక్ష్యాలు.**

ఒక విత్తనం... ఒక ప్రాణం. ఒక మొక్క.. ఒక వరం. ఆధునిక కాలంలో గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వంటి సవాళ్లు మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వేళ, ప్రకృతిని కాపాడుకోవడం ధార్మిక బాధ్యత. ముఖ్యంగా, 'వన మహోత్సవం' వేళ ఈ ఆలోచనలు మరింత అర్థవంతంగా మారుతున్నాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ వృక్ష సంపదను కాపాడుకోవడం, కొత్త మొక్కలను నాటడం అనేది ఏ మతానికైనా మించిన మానవీయ విలువ.

## నిరంతర పుణ్యధార..

"మనం నాటే ప్రతి మొక్కా, ఒక నిరంతర పుణ్యకార్యం (సదకా జారియా)" అని ఇస్లాం బోధిస్తోంది. ప్రవక్త ముహమ్మద్ (శాంతి ఆయనపై కలుగుగాక) చెప్పిన మాటలు ఈ రోజుల్లో పర్యావరణ వేత్తలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి. ఒక వ్యక్తి ఒక మొక్కను నాటితే, ఆ చెట్టు ఇచ్చే నీడను, పండ్లను, ఆక్సిజన్‌ను మనుషులైనా, పక్షులైనా, జంతువులైనా ఎవరైనా సరే.. ఎంతమంది ఉపయోగించుకుంటే, అంత పుణ్యం ఆ మొక్క నాటిన వ్యక్తి ఖాతాలో జమ అవుతుందట. అంతేకాదు, ఆ వ్యక్తి మరణించినా సరే, ఆ చెట్టు ఉన్నంత కాలం అతనికి పుణ్యఫలం అందుతూనే ఉంటుందట. ఇది ఎంత అద్భుతమైన భావన! భూమిపై మనం లేకపోయినా, మనం నాటిన చెట్టు పచ్చగా ఉండి ప్రాణకోటికి మేలు చేస్తుందంటే.. అంతకంటే గొప్ప వారసత్వం ఇంకేముంటుంది?

## ప్రళయకాలంలోనూ మొక్క నాటాల్సిందే!

సాధారణంగా ఏదైనా పనికి ఫలితం వెంటనే కావాలనుకుంటాం. కానీ, ఇస్లాం బోధించే ఒక గొప్ప విషయం ఏంటంటే---"ఒకవేళ రేపు ప్రళయం వస్తుందని తెలిసినా, నీ చేతిలో ఒక మొక్క ఉంటే, అది నాటకుండా ఉండకు" అని. ఫలితం గురించి చింతించకుండా, మానవత్వంతో, భవిష్యత్ తరాల కోసం పని చేయడమే అసలైన గొప్పతనం అని ఈ మాట చాటి చెబుతుంది. ప్రకృతిని నాశనం చేయడం, అకారణంగా చెట్లను నరికేయడం వంటివి ఎంతటి పాపమో, చెట్లను పెంచడం అంతటి పుణ్యమని ఈ ప్రవచనాలు హెచ్చరిస్తున్నాయి, ప్రోత్సహిస్తున్నాయి.

## వన మహోత్సవం - మన బాధ్యత

భారతదేశంలో 'వన మహోత్సవం' అంటేనే పచ్చదనానికి పెద్దపీట వేయడం. ప్రకృతిని 'అమానత్' (పవిత్రమైన ట్రస్ట్)గా భావించే మనం, ఈ వారం రోజుల్లో కేవలం మొక్కలు నాటడమే కాదు, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలి.

**పచ్చని సంకల్పం :** మీ ఇంటి ఆవరణలో, ఖాళీ స్థలాల్లో, కనీసం ఒక చిన్న మొక్కనైనా నాటండి.

**నీరు- సంరక్షణ :** మొక్క నాటడం ఎంత ముఖ్యమో, దానికి క్రమం తప్పకుండా నీరు పోసి, ఎదగనివ్వడం అంతకంటే ముఖ్యం.

**అవగాహన :** చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను పిల్లలకు వివరించండి. మనం భూమిని ఆక్రమించుకునే వారిగా కాకుండా, భూమికి సంరక్షకులుగా (ఖలీఫా) మారదాం.

ప్రకృతిని ప్రేమిద్దాం.. పచ్చని మొక్కలతో రేపటి తరాలకు ప్రాణ వాయువును, చల్లని నీడను బహుమతిగా ఇద్దాం. గుర్తుంచు కోండి.. మనం నాటే ప్రతి మొక్కా భవిష్యత్తుకు మనం రాసే ఒక పచ్చని సంతకం!

ఒక విత్తనం.. రేపటి విశ్వానికి ప్రాణం,
ఒక మొక్క.. మానవాళికి దేవుడిచ్చిన వరం!
స్వార్థపు వేడిలో ధరాతలం తల్లడిల్లుతున్న వేళ,
మొక్కను నాటడమే కదా.. నిజమైన పుణ్యఫలం!
ప్రళయ కాలపు అంచున నువ్వు నిలబడి ఉన్నా,
చేతిలోని మొక్కను నాటడం మరవకు అన్నా!
నువ్వు ఇచ్చే నీడ, నువ్వు పంచే శ్వాస,
నీ తదనంతరమూ సాగే.. నిరంతర పుణ్యధార!
భూమికి మనం యజమానులం కాము, కేవలం కాపలాదారులం,
ప్రకృతి అనే నమ్మకానికి (అమానత్‌కు) సంరక్షకులం!
రాబోయే తరాలకు కాంక్రీట్ వనాలు కాదు,
పచ్చని చెట్లతో ప్రాణవాయువును బహుమతిగా ఇద్దాం!
మనం నాటే ప్రతి మొక్కతో.. భూమిపై ఒక పచ్చని సంతకం చేద్దాం!

# ఎస్.ఐ.ఆర్ (SIR) ప్రక్రియలో ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా తొలగించబడకూడదు

## ముస్లిం సమాజంలోని అన్ని సంఘాలు, సంస్థలు తక్షణమే రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది

**ఎస్.ఐ.ఆర్ (SIR)** ప్రక్రియను సాకుగా చూపుతూ అర్హులైన ఓటర్ల, ముఖ్యంగా ముస్లిం మైనారిటీల పేర్లను ఓటర్ల జాబితా నుండి పెద్ద ఎత్తున తొలగించే కుట్రలు జరుగుతున్నాయనే ఆందోళనల నేపథ్యంలో... జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ అజ్‌హరుద్దీన్ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రక్రియలో ఏ ఒక్క అర్హుడైన ముస్లిం ఓటరు పేరు కూడా తొలగింపునకు గురికాకుండా చూడాల్సిన గురుతర బాధ్యత సమాజంలోని అన్ని మత, సామాజిక, రాజకీయ, సంక్షేమ సంస్థలపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో తమ పేరు భద్రంగా ఉందో లేదో సరిచూసుకోవడం ప్రాథమికంగా ప్రతి పౌరుని బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, సమాజ శ్రేయస్సును కాంక్షించే మేధావులు, సామాజిక సంస్థలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని కోరారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అప్పుడే, సాంకేతిక, చిన్నపాటి కారణాలను నెపంగా చూపి ముస్లిం ఓట్లను తొలగించే సాహసం ఏ అధికారీ చేయలేరని అన్నారు.


### మార్గదర్శక కేంద్రాల (గైడెన్స్ సెంటర్స్) ఏర్పాటు

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే జమాఅత్, దాని అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో ప్రజలకు దిశా నిర్దేశం చేయడానికి, అవసరమైన సహాయం అందించడానికి పలు ప్రాంతాలలో 'ఎస్.ఐ.ఆర్ గైడెన్స్ సెంటర్లు' ఏర్పాటు చేసినట్లు జనాబ్ అజహరుద్దీన్ తెలిపారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల




కేంద్రాలలో మరిన్ని మార్గదర్శక కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంలో ప్రదర్శించే ఏమరుపాటు భవిష్యత్తులో కోలుకోలేని పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం సంస్థల మధ్య పరస్పర సమన్వయం, త్యాగనిరతి ఉంటేనే ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను విజయవంతంగా ఎదుర్కోగలమని, లేనిపక్షంలో సమాజంలోని ఒక బృహత్తర వర్గం తమ ప్రాథమిక ఓటుహక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ గడువును తక్షణమే పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన అమీర్-ఎ-హల్ఖా, క్షేత్రస్థాయి సిబ్బందికి (BLO) తగిన శిక్షణనిచ్చి ప్రజల వద్దకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పుడే వారు పక్షపాతం లేకుండా, పారదర్శకంగా పనులు పూర్తి చేయగలరని అన్నారు. "ప్రజలు గనుక ఈ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తే, రాబోయే రోజుల్లో ఇదే ఎస్.ఐ.ఆర్‌ను పౌరసత్వ నిరూపణకు ప్రామాణికంగా తీసుకునే ప్రమాదం ఉంది. తద్వారా మన పౌరసత్వమే ప్రశ్నార్థకమై, అనుమానాస్పద స్థితిలోకి నెట్టబడే ముప్పు పొంచి ఉంది. కాబట్టి, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును, పౌరసత్వాన్ని రక్షించుకోవాలి" అని జనాబ్ ముహమ్మద్ అజ్‌హరుద్దీన్ అప్రమత్తం చేశారు.

# ఇసుక గీతలు... రాతి చెక్కడాలు!




**ఎండ నిప్పులు చెరుగుతోంది.** చుట్టూరా చూస్తే అనంతమైన ఇసుక తిన్నెలు. ఆ ఎడారి దారిలో ఖాసిమ్, హసన్ అనే ఇద్దరు ప్రాణ స్నేహితులు నడుస్తున్నారు. ఎండ తీవ్రతకు ఒళ్లంతా చెమటలు పడుతున్నాయి, గొంతు ఎండిపోతోంది. నీటి కోసం వారి అన్వేషణ సాగుతూనే ఉంది. ఆ అలసట, నీరసంలో వారి మధ్య ఒక చిన్న విషయంలో వాదన మొదలైంది.

ఆ క్షణికావేశంలో వాదన కాస్తా ముదిరింది. ఓపిక నశించిన ఖాసిమ్, కోపంతో హసన్ ముఖంపై కొట్టాడు. ఆ దెబ్బకు హసన్ శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎంతో గాయపడ్డాడు. కానీ, ఎదురుదాడి చేయలేదు, నోరువిప్పి ఒక్క మాట కూడా అనలేదు. మౌనంగా మోకాళ్లపై కూర్చుని, అక్కడి ఇసుకపై వేలితో ఇలా రాశాడు:

"ఈరోజు నా ప్రాణస్నేహితుడు నా ముఖంపై కొట్టాడు."

★★★

మరో మాట లేకుండా వారి ప్రయాణం సాగింది. కొంతదూరం వెళ్లేసరికి ఎడారి మధ్యలో పచ్చని చెట్లతో కూడిన ఒక అందమైన ఒయాసిస్ (నీటి ప్రదేశం) కనిపించింది. దాహంతో అల్లాడుతున్న ఆ ఇద్దరి ఆనందానికి అవధులు లేవు. కాసేపు స్నానం చేసి సేదతీరాలని నిర్ణయించుకున్నారు.

హసన్ ఎగిరి నీటిలోకి దూకాడు. ఖాసిమ్ ఒడ్డున కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంతా బాగుంది అనుకునేలోపు, నీటిలో ఉన్న హసన్‌కు అకస్మాత్తుగా కండరాల తిమ్మిరి (cramp) వచ్చింది. అంతే... కాళ్లు, చేతులు ఆడించలేక శ్వాస అందక నీటిలో మునిగిపోతూ గట్టిగా కేకలు వేయడం మొదలుపెట్టాడు.

★★★

స్నేహితుడి ఆర్తనాదాలు విన్న ఖాసిమ్ క్షణం కూడా ఆలస్యం చేయలేదు. తన ప్రాణాలను పణంగా పెట్టి నీటిలోకి దూకాడు. ఈత కొడుతూ వెళ్లి మునిగిపోతున్న హసన్‌ను పట్టుకుని, అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చాడు.

హసన్ కాసేపటికి తేరుకున్నాడు. ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నాడు. వెంటనే లేచి, ఒడ్డున ఉన్న ఒక పెద్ద రాయి దగ్గరకు వెళ్లి, ఓ పదునైన చిన్న రాయితో దానిపై ఇలా చెక్కాడు:

"ఈరోజు నా ప్రాణస్నేహితుడు నా ప్రాణాలు కాపాడాడు."

★★★

ఇదంతా గమనిస్తున్న ఖాసిమ్‌కు ఆశ్చర్యం వేసింది. తప్పుచేశాననే పశ్చాత్తాపంతోనే హసన్‌ను అడిగాడు, "మిత్రమా! ఇందాక నేను నిన్ను బాధపెట్టినప్పుడు ఇసుకలో రాశావు. కానీ, ఇప్పుడు నీ ప్రాణాలు కాపాడితే రాయిపై చెక్కుతున్నావు... ఎందుకు?"

హసన్ అతని వైపు చూసి ప్రేమగా నవ్వి ఇలా సమాధానమిచ్చాడు:

"ఎవరైనా మనల్ని బాధపెట్టినప్పుడు ఆ చేదు జ్ఞాపకాన్ని ఇసుకపై రాయాలి. ఎందుకంటే, క్షమాపణ అనే చల్లని గాలి వీచినప్పుడు ఆ గాయం సులువుగా తుడిచిపెట్టుకుపోతుంది. అదే ఎవరైనా మనకు మంచి చేసినప్పుడు, ఆ కృతజ్ఞతను గుండె అనే రాయిపై చెక్కాలి. కాలం ఎలాంటి తుఫానులను తీసుకువచ్చినా... ఆ మధుర జ్ఞాపకం ఎప్పటికీ చెరిగిపోకూడదు!"

హసన్ మాటలకు ఖాసిమ్ కళ్లు చెమర్చాయి. ఇద్దరు మిత్రులు ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకున్నారు. ❖

# కాలం చెరగని న్యాయ సూత్రం!

## హార్వర్డ్ గోడలపై ఖురాన్ వాక్యం : 1400 ఏళ్ల నాటి 'న్యాయ' విప్లవం!

**అది ప్రపంచంలోనే అత్యున్నత చట్టాల పాఠాలు నేర్పే హార్వర్డ్ లా స్కూల్ ప్రాంగణం. అక్కడ అడుగుపెడుతుంటే ప్రపంచవ్యాప్తంగా సమాజాలను శాసించిన ఎన్నో చట్టాలు, తీర్పులు మన కళ్లముందు కదలాడుతుంటాయి. కానీ, ఆ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్దకు రాగానే, ప్రతి ఒక్కరిని ఆకర్షించేలా ఒక పవిత్ర వాక్యం గోడపై సువర్ణాక్షరాలతో కనిపిస్తుంది. అదే.. ఖురాన్‌లోని 'సూరా అన్–నిసా' (4వ అధ్యాయం, 135వ వచనం).**

**"విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే.!"** అనే ఆ వాక్యం చదువుతుంటే, గుండె లోతుల్లో ఏదో ఒక తెలియని నిశ్శబ్దం, ఆపై ఒక నిఖార్సైన సత్యం తాలూకు స్పందన కలుగుతుంది.

ఇంతకీ ఈ న్యాయ సూత్రం వెనుక ఉన్న మానవీయ కోణమేంటి? ఇది కేవలం ఒక గోడపై చెక్కిన అక్షరం కాదు, మానవజాతి చరిత్రను మార్చేసిన ఒక సామాజిక విప్లవం.

### మనుషుల మధ్య వివక్ష లేని 'త్రాసు'

మనం బంధువుల ముందో, సమాజం ముందో తలవంచేస్తాం. కానీ ఈ వచనం చెబుతోంది– న్యాయం ముందు అందరూ సమానులే. నువ్వు సాక్ష్యం చెప్పాల్సింది దైవ సాక్షిగా! ఆ సాక్ష్యం నీకు గానీ, నీ కన్నవారికి గానీ వ్యతిరేకమైనా సరే వెనుకాడొద్దు. ఎదుటివాడు కోటీశ్వరుడైనా, నిరుపేదయైనా న్యాయం పక్షానే నిలబడు. ఎందుకంటే వారిద్దరినీ కాపాడగలిగే శక్తి ఆ పైవాడికి మాత్రమే ఉంది.

ఈ మాటల్లో ఉన్న నైతిక బలం, నిష్పాక్షికత హార్వర్డ్ మేధావులను సైతం మంత్రముగ్ధులను చేసింది. అందుకే ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన 'న్యాయ ప్రకటనల' (Words of Justice) ప్రదర్శనలో దీనికి అగ్రతాంబూలం ఇచ్చారు.

### 1400 ఏళ్ల క్రితం కురిసిన సమానత్వపు జల్లు

చరిత్ర పుటలను ఒకసారి వెనక్కి తిప్పితే.. ఒకప్పుడు మహిళకు, పసిబిడ్డకు సమాజంలో కనీస గుర్తింపు ఉండేది కాదు. ఆస్తిపాస్తుల మాట పక్కన పెడితే, వారిని కనీసం మనుషులుగా చూసేందుకు కూడా కొన్ని సంస్కృతులు అంగీకరించలేదు. సామ్రాజ్యాలు మారినా, పాలకులు మారినా.. సంపద అంతా కొద్దిమంది పురుషుల, ఉన్నత వర్గాల చేతుల్లోనే బందీగా ఉండేది.

కానీ, సరిగ్గా పద్నాలుగు శతాబ్దాల క్రితం, ఎడారి ఇసుక తిన్నెలపై ఒక అద్భుతం జరిగింది. ఇస్లామిక్ చట్టం (షరియా) రూపంలో మహిళల, పిల్లల హక్కులకు ఒక తిరుగులేని రక్షణ కవచం లభించింది. చరిత్రలో బహుశా మొదటిసారిగా– కుటుంబ ఆస్తిలో, సంపదలో మహిళలకు, చిన్న పిల్లలకు చట్టబద్ధమైన వాటాను కల్పిస్తూ దైవిక ఆజ్ఞలు వెలువడ్డాయి.

ఇది కేవలం చట్టం కాదు, ఒక తల్లికి దక్కిన గౌరవం.. ఒక భార్యకు లభించిన భద్రత.. ఒక కూతురికి అందిన ఆత్మవిశ్వాసం! సంపద అనేది కొద్దిమంది ధనవంతుల ఇళ్లలోనే మూలుగుతూ ఉండకూడదని, అది సమాజంలో ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలని ఆనాడే ఇస్లాం చాటిచెప్పింది.

ఈ వ్యవస్థలోని మానవీయ కోణాన్ని కేవలం ముస్లిం పండితులే కాదు.. మాక్స్ వెబర్, జార్జ్ సేల్, బెర్నార్డ్ లూయిస్ వంటి ఎందరో గొప్ప పాశ్చాత్య చరిత్రకారులు, ఆర్థికవేత్తలు మనసారా ప్రశంసించారు. ఇస్లామిక్ వారసత్వ చట్టాల్లో ఉన్న క్రమశిక్షణ, సామాజిక సమతుల్యత వారిని ఆశ్చర్యపరిచాయి. ఎందరో హేతువాదులు, నాడు మహిళా హక్కుల కోసం పోరాడిన వారు సైతం– ఈ చట్టం స్త్రీల ఆర్థిక స్వేచ్ఛకు ఎంతటి భద్రతనిచ్చిందో చూసి అబ్బురపడ్డారు.

### మానవత్వమే పరమార్థం

న్యాయం అనేది ఒక మతానికో, ఒక ప్రాంతానికో పరిమితమైంది కాదు. అది మానవత్వపు అంతరాత్మ. హార్వర్డ్ లా స్కూల్ ప్రవేశ ద్వారం వద్ద నిలబడి ఆ ఖురాన్ వాక్యాన్ని చదువుతుంటే.. యుగాలు మారినా, నాగరికతలు ముందడుగు వేసినా, మనిషి బ్రతకడానికి కావాల్సిన అసలైన సూత్రం ఒకటే అనిపిస్తుంది. అది–"పక్షపాతం లేని న్యాయం.. హద్దులు లేని కరుణ."

నేటి స్వార్థపూరిత ప్రపంచంలో, బంధాల కోసం చట్టాలను చుట్టాలుగా మార్చుకునే కాలంలో.. హార్వర్డ్ ముంగిట వెలుగుతున్న ఈ 'న్యాయ' దీపిక, ప్రతి మనిషి హృదయంలో నిజాయితీ అనే వెలుగును నింపాలని ఆకాంక్షిద్దాం!

**- తౌఫీక్ అహ్మద్**

కథ




- ముహమ్మద్ వహీదుద్దీన్

# ఒక ఖాళీ మంచం... ఒక నిశ్శబ్ద బోధన

**ఆ పల్లెటూరి ప్రశాంతతలో అబ్దుల్ హకీమ్ అనే వృద్ధుడి నడక ఒక పవిత్ర లయ. ఐదు పూటల నమాజ్ కోసం ఆయన మస్జిద్ వైపు వేసే ప్రతి అడుగూ ఒక ఇబాదత్. పెదవులపై ఖుర్‌ఆన్ పఠనం, గుండెల్లో అల్లాహ్ పట్ల భయం, చేతుల్లో పేదలకు సహాయం చేసే గుణం– ఇవే ఆయన జీవితానికి అలంకారాలు. నిరంతరం ఆయన నోట ఒకే మాట వినిపించేది:**

“బిడ్డలూ... ఈ రంగుల లోకం మన శాశ్వత నివాసం కాదు. ఇది కేవలం ఒక ముసాఫిర్‌ఖానా. మన అసలు ఇల్లు, మన గమ్యస్థానం జన్నత్ (స్వర్గం) కావాలి.”

కానీ, ఆయన ముగ్గురు కుమారులు లౌకిక ప్రపంచపు వేగంలో కొట్టుకుపోతున్నారు. ఒకడు పరాయి దేశపు మోజులో, మరొకడు వ్యాపార లాభనష్టాల లెక్కల్లో, ఇంకొకడు ఉద్యోగ బాధ్యతల్లో మునిగిపోయారు. “ఇంకా జీవితం చాలా ఉంది నాన్నా... వయసు అయిపోయాక నిదానంగా ఇబాదత్ చేసుకోవచ్చులే” అని తండ్రి మాటలను సున్నితంగా దాటవేసేవారు.

కాల చక్రం తిరుగుతోంది. ఒకరోజు తెల్లవారుజామున... ఫజ్ర్ నమాజ్ కోసం ముఅజ్జిన్ గొంతు నుండి ‘అల్లాహు అక్బర్’ అంటూ అజాన్ వినిపించింది. ఊరి జనం మస్జిద్‌కు చేరుకున్నారు. కానీ, ఎప్పుడూ అందరికంటే ముందుండే అబ్దుల్ హకీమ్ ఆరోజు రాలేదు. ఆ శూన్యం అందరిలోనూ ఆందోళన రేపింది.

కొందరు గ్రామస్థులు ఆయన ఇంటికి వెళ్లి చూశారు. అక్కడ... ఆయన తన మంచంపై ప్రశాంతంగా పడుకుని ఉన్నారు. శ్వాస ఆగిపోయింది, కానీ ముఖంలో ఒక దివ్యమైన తేజస్సు, పెదవులపై నిశ్శబ్దమైన చిరునవ్వు తాండవిస్తోంది. ఆయన ఆత్మ ఈ భౌతిక బంధాలను తెంచుకుని, అల్లాహ్‌ను కలుసుకోవడానికి అనంత లోకాలకు పయనమై పోయింది.

కొద్దిసేపట్లోనే ఆ ఇల్లు జనారణ్యమైంది. బంధువుల రోదనలు, కుమారుల కన్నీళ్లు ఆ గదిని ముంచెత్తాయి. కానీ, ఆ గది మూలన ఉన్న ఆయన మంచం మాత్రం భయంకరమైన నిశ్శబ్దాన్ని మోస్తోంది. నిన్నటివరకు ఆ మంచంపై కూర్చుని, పిల్లలకు జీవిత పరమార్థాన్ని, ఖుర్‌ఆన్ సత్యాలను బోధించిన ఆ కంటిపాప... నేడు అక్కడ లేదు.

జనాజా నమాజ్ ముగిసింది. కన్నతండ్రి దేహాన్ని సమాధి గుంతలో దించి, కుమారులు తమ చేతులతో మట్టి వేశారు. అంత్యక్రియలు ముగిశాయి. వచ్చిన జనం ఒక్కొక్కరుగా తమ ఇళ్లకు తిరుగుముఖం పట్టారు. లౌకిక ప్రపంచం మళ్లీ తన పనిలో పడిపోయింది.

సాయంత్రం చీకట్లు ముసురుతున్న వేళ... చిన్న మనవడు నెమ్మదిగా తాతయ్య గదిలోకి వెళ్లాడు. అక్కడ ఒంటరిగా ఉన్న ఆ ఖాళీ మంచాన్ని చూసి, గుమ్మం వద్ద నిలబడి ఏడుస్తున్న తన తండ్రి వైపు అమాయకంగా చూస్తూ అడిగాడు:

"నాన్నా...! తాతయ్య ఎక్కడికి వెళ్లారు? ఎప్పుడు తిరిగి వస్తారు?"

ఆ ప్రశ్న ఒక శూలంలా తండ్రి గుండెల్లోకి దిగబడింది. కట్టలు తెంచుకున్న కన్నీటిని ఆపుకుంటూ, కొడుకును గుండెలకు హత్తుకుని అన్నాడు:

"బాబూ... తాతయ్య ఇక ఏనాటికీ తిరిగి రారు. ఈ ప్రపంచంతో ఆయన బంధం ముగిసింది. రేపో, మాపో మనం కూడా ఆ అల్లాహ్ పిలుపు అందుకోవాల్సిందే. మనం ఇక్కడ మంచి పనులు చేస్తే... రేపు జన్నత్‌లో తాతయ్యను మళ్లీ కలుసుకోవచ్చు."

ఆ మాట వినగానే, ఆ చిన్నారి నిశ్శబ్దంగా తాతయ్య చదివే దివ్య ఖుర్‌ఆన్‌ను తీసి, భక్తితో తన హృదయానికి హత్తుకున్నాడు.

ఆ క్షణం నుంచి ఆ ఇంటి పునాదులు కదిలాయి. కుమారుల కళ్లు తెరుచుకున్నాయి. అప్పటివరకు నిర్లక్ష్యం చేసిన నమాజ్ ఇప్పుడు వారి జీవిత శ్వాసగా మారింది. ఆ ఇంట ప్రతిరోజూ ఖుర్‌ఆన్ మధుర స్వరం ప్రతిధ్వనించడం మొదలైంది. తండ్రి ఆశయాలకు అనుగుణంగా పేదలకు దానధర్మాలు చేయడం నిత్యకృత్యమైంది. ఎందుకంటే, ఆ ఖాళీ మంచం వారికి ఒక కఠోర సత్యాన్ని బోధించింది–

మరణించిన తండ్రి సంతానానికి వదిలి వెళ్లాల్సింది బ్యాంక్ బ్యాలెన్స్ కాదు; సత్కార్యాల విలువ, ఇస్లామీయ సంస్కారం.

## ఆత్మపరిశీలన

సత్యం ఎంత చేదుగా ఉంటుందో, మరణం అంతకంటే నిఖార్సైనది. రేపో, ఎల్లుండో... మన ఇంట్లో కూడా ఒక ఖాళీ మంచం దర్శనమిస్తుంది. మనం ప్రాణప్రదంగా దాచుకున్న బట్టలు బీరువాలోనే ఉంటాయి, మనం వాడిన వస్తువులు, ఫోన్ అన్నీ అలాగే పడి ఉంటాయి. ఫోన్ రింగ్ కావచ్చు, మన పేరు పెట్టి పిలిచేవారూ ఉండవచ్చు... కానీ, సమాధానం చెప్పడానికి మన ఉనికి అక్కడ ఉండదు.

మనల్ని ప్రేమించిన వారు కొద్దిరోజులు కన్నీరు కారుస్తారు. జనాజా నమాజ్ చదివి, భుజాలపై మోస్తూ తీసుకెళ్లి చీకటి సమాధిలో పడుకోబెడతారు. నెత్తిన మట్టిపోసి, కాసేపు దువా చేసి, "పాపం మంచివాడు" అంటూ అందరూ తమ ఇళ్లకు, తమ వ్యాపారాలకు వెళ్ళిపోతారు.

ఆ ఆరడుగుల చీకటి సమాధిలో మనతో పాటు తోడుగా ఉండేది, మనల్ని రక్షించేది మన బ్యాంక్ అకౌంట్లు కావు; కేవలం మన ఈమాన్ (విశ్వాసం), నమాజ్, ఖుర్‌ఆన్ పఠనం, సదఖా (దానం), మనం చేసిన సత్కార్యాలు మాత్రమే.

అందుకే సోదరులారా...! కాలం చేజారిపోకముందే, శ్వాస ఆగిపోకముందే మన హృదయాలను అల్లాహ్ వైపు తిప్పుకుందాం. చేసిన పాపాలకు ఇప్పుడే, ఈ క్షణమే 'తౌబా' (పశ్చాత్తాపం) చేసుకుందాం. నమాజులను ప్రాణప్రదంగా కాపాడుకుందాం. ఎందుకంటే, రేపటి సూర్యోదయాన్ని చూసే భాగ్యం మనకు ఉందో లేదో ఎవరికీ తెలియదు!

అల్లాహ్ మనందరికీ ఈమాన్‌తో కూడిన సుదీర్ఘ జీవితాన్ని, మరణించేటప్పుడు 'హుస్నుల్ ఖాతిమా' (మంచి ముగింపును), సమాధిలో ప్రశాంతతను ప్రసాదించుగాక. తీర్పుదినాన తన అనంతమైన కారుణ్యంతో మనల్ని కాపాడి, జన్నతుల్ ఫిర్దౌస్‌లో ఉన్నత స్థానాన్ని కల్పించుగాక.

## దీపం రెక్క

**- కరీముల్లా కవిత్వం**

ఓరిమి, ఓటమి
ఒక్కటి కాదు
కాలాన్ని నిందించకు
కువకువలాపిందని
పాలపిట్టను పరిహసించకు
అవసరాలు, అనివార్యాలను
మించిన గొప్ప అనుభవముందా?
అందరిముందూ, అన్నిసార్లూ
అన్నీ విప్పి చూపలేం
గుండె గర్భంలో
బుల్లి ఫిరంగిని పెంచుకుంటూ
కిటికీ మూయడం ఒక వ్యూహమే
ష్... గప్చుప్
వెన్నెల రాత్రుల పంచనామా
ఇప్పుడే మొదలయ్యింది
మరిన్ని నెలవంకల్ని కనే తీరాలి
నిజానికి పురుటి నొప్పులు
అందరికీ ఉంటాయి
మనుషుల్ని కొందరే కంటారు
విశ్వం చీకటిని చీల్చుకుంటూ
లంగరు వేయని నావలా
కిరణం ప్రయాణిస్తుంది
వీరుడికి వెనకడుగు వుంటుందా?
పిచ్చివాడా!
భయం, చావు వేర్వేరు కావు
పులుల గుంపులో చిక్కిన జింకలు
శవాల్లానే నటిస్తాయి
వీలు చూసి కొమ్ములూ విసుర్తాయి
పులి గాయపడిందో లేదో చెప్పు
పిండికొద్దీ రొట్టె
కసి కొద్దీ కవిత్వం
అలారం మోగుతోంది
నిస్పృహల దుప్పటి తీసి చూడు
ఉదయం జాడ లేదని
మళ్ళీ కునుకు తీయకు
మిణుకు మిణుకు మంటున్న
దీపం రెక్కలవిగో!
ఎవరి కోసమో
ఎదురు చూస్తున్నట్టున్నావ్
నీ వెంటే ప్రపంచం
ఇక పద..!




## భారత పాస్‌పోర్ట్ విలువ మరింత పతనం

ప్రపంచవ్యాప్తంగా దేశాల పాస్‌పోర్ట్ బలాన్ని అంచనా వేసే 'గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్-2026' నివేదికలో భారతదేశానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మొత్తం 197 దేశాల జాబితాలో భారత్ గత ఏడాది కంటే ఒక స్థానం దిగజారి 125వ ర్యాంకుకు పడిపోగా.. నమీబియా, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్ వంటి చిన్న దేశాలు మనకంటే మెరుగైన స్థానాల్లో నిలిచాయి. గ్లోబల్ సిటిజన్ సొల్యూషన్స్ (GCS) సంస్థ ప్రయాణ సౌలభ్యం, పెట్టుబడి అవకాశాలు, జీవన ప్రమాణాల ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటించింది. ప్రస్తుతం భారతీయులు అమెరికా, బ్రిటన్ సహా 88 దేశాలకు వెళ్లాలంటే వీసా తప్పనిసరి కాగా.. మరోవైపు "పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణ పత్రమే కానీ పౌరసత్వ నిరూపణ కాదు" అని కేంద్ర విదేశాంగ శాఖ చేసిన వ్యాఖ్యలు అంతర్గతంగా తీవ్ర వివాదానికి దారితీశాయి.

## వారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు

రోడ్డు భద్రతా నిబంధనలను మరింత పటిష్టం చేసి పదేపదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడడాన్ని నిరోధించడానికి మోటారు వాహనాల చట్ట నిబంధనల్లో భారీ సవరణలకు కేంద్రం యోచిస్తున్నది. రాష్ట్రాలతో దాదాపు రెండేళ్లపాటు సంప్రదింపులు జరిపి మంత్రుల బృందం నుంచి ఆమోదం పొందిన తర్వాత తీసుకురావలసిన మార్పుల కోసం కేంద్ర రోడ్డురవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ఒక ప్రతిపాదనను రూపొందించింది. పదేపదే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయడం కీలక ప్రతిపాదనల్లో ఒకటి. సస్పెండ్ అయిన లైసెన్సును పునరుద్ధరించుకోవడానికి వాహనదారులు ప్రభుత్వ అధీకృత డ్రైవింగ్ పరీక్షా కేంద్రంలో మళ్లీ డ్రైవింగ్ పరీక్ష రాయవలసి ఉంటుంది.

## మధ్యప్రదేశ్ వక్ఫ్ బోర్డులో హిందూ సభ్యుల నియామకం

మధ్యప్రదేశ్ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం-2025ను అనుసరిస్తూ, దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర వక్ఫ్ బోర్డును పునర్వ్యవస్థీకరించి ఇద్దరు హిందూ సభ్యులను నియ మించడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. పారదర్శకత, జవాబుదారీతనం, మెరుగైన ఆస్తి నిర్వహణే లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంటుండగా, ఈ నిర్ణయంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. బోర్డులో ఇస్లామిక్ వ్యవహారాలపై అవగాహన లేని వారి నియామకంపై మతపరమైన వర్గాల నుండి భిన్నమైన వాదనలు వినిపిస్తుండగా, ఇది కేవలం పరిపాలనాపరమైన సంస్కరణ అని బీజేపీ వర్గాలు సమర్థించుకుంటున్నాయి.

## భారత్‌లో మస్జిదుల కూల్చివేతలపై 'జస్టిస్ ఫర్ ఆల్' ఆందోళన



భారతదేశంలో ముస్లిం మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న మస్జిదుల కూల్చివేతలపై అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ 'జస్టిస్ ఫర్ ఆల్' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రంలోని అధికార బీజేపీ అవలంబిస్తున్న బహుళ సంఖ్యాకవాద (మేజారిటేరియన్) విధానాల వల్ల దేశంలో మతసహనం ప్రమాదంలో పడిందని ఓ ప్రకటనలో పేర్కొంది. గడిచిన ఐదు రోజుల్లోనే ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్, వారణాసిలతో పాటు రాజస్థాన్‌లోని జైపూర్‌లో మూడు మస్జిదులను వివిధ సాకులతో కూల్చివేసిన ఉదంతాలను సంస్థ ప్రస్తావించింది. వారణాసిలో దాదాపు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన షహీద్ అజ్జెబ్ మస్జిదును కూడా అక్రమ ఆక్రమణల నెపంతో తొలగించడాన్ని తప్పుబట్టింది. పబ్లిక్ స్థలాల్లో వెలిసిన మెజారిటీ వర్గానికి చెందిన నిర్మాణాలపై అధికారులు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని విమర్శించింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మైనారిటీలపై ద్వేషపూరిత ప్రసంగాలు, దాడులు పెరిగాయని 'సేవ్ ఇండియా ఫ్రమ్ ఫాసిజం' ప్రచార నిర్వాహకులు జహీర్ ఆదిల్ ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను కాలరాస్తూ, మైనారిటీలలో అభద్రతా భావాన్ని సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈ ద్వేషపూరిత రాజకీయాలను, మెజారిటీవాద ధోరణులను తిరస్కరించడానికి భారత మేధావి వర్గం తక్షణమే ఏకతాటిపైకి రావాలని 'జస్టిస్ ఫర్ ఆల్' పిలుపునిచ్చింది.

సర్వత్రా

## గాజాలో ఘోరకలి

పాలస్తీనా అంతర్భాగమైన గాజా స్ట్రిప్‌లో గత వెయ్యి రోజులుగా సాగుతున్న భీకర యుద్ధం పెను విషాదాన్ని మిగిల్చింది. నిరంతరాయంగా సాగిన దాడుల వల్ల గాజాలో దాదాపు 90 శాతానికి పైగా భూభాగం పూర్తిగా శిథిలాల కుప్పగా మారిందని, ఎటు చూసినా శ్మశాన వైరాగ్యం తాండవిస్తోందని అక్కడి ప్రభుత్వ మీడియా కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. ఈ సుదీర్ఘ పోరాటంలో ఇప్పటివరకు 2,700 కంటే ఎక్కువ పాలస్తీనా కుటుంబాలు నూతన చరిత్ర పుటల నుంచి పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి. వంశాలకు వంశాలే సమూలంగా నాశనమవడంతో, వారి పేర్లను ప్రభుత్వ సివిల్ రిజిస్ట్రీ రికార్డుల నుంచి శాశ్వతంగా తొలగించాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో 6,020 కుటుంబాలలో కేవలం ఒక్కరంటే ఒక్కరు మాత్రమే ప్రాణాలతో మిగిలి ఈ మహా విషాదానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచారు. యుద్ధ తీవ్రతకు గాజా దశాబ్దాల కాలం వెనక్కి నెట్టబడింది. ఇప్పటివరకు లభించిన గణాంకాల ప్రకారం 73,000 మందికి పైగా మృత్యువాత పడగా, అందులో 21,500 మందికి పైగా పసిపిల్లలు, 12,500 మంది మహిళలు ఉండటం పరిస్థితి భీభత్సానికి అద్దం పడుతోంది. తీవ్రమైన బాంబు దాడుల వల్ల నివాస సముదాయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, మౌలిక సదుపాయాలు పూర్తిగా ధ్వంసమవడంతో.. దాదాపు 15 లక్షల మంది ప్రజలు నిలువ నీడ లేక, దక్షిణ గాజాలోని తాత్కాలిక టెంట్లలో నరక ప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఆహారం, తాగునీరు, అత్యవసర మందుల కొరతతో జనాభాలో 80 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన అలమటిస్తున్నారు. అంతర్జాతీయ సంస్థలు, ఐరాస భద్రతా మండలి ఈ మానవతా సంక్షోభాన్ని నివారించడంలో పూర్తిగా విఫలమయ్యాయని పాలస్తీనా అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎక్కువసేపు కూర్చుంటే క్యాన్సర్ ముప్పు!

ఎక్కువసేపు కూర్చోవటం క్యాన్సర్‌బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. తేలికపాటి శారీరక శ్రమతో క్యాన్సర్ మరణాలను తగ్గించవచ్చునని పరిశోధకులు శాస్త్రీయంగా గుర్తించారు. గ్లాస్గో వర్సిటీ, ఇతర పరిశోధకుల బృందం యూకే బయోబ్యాంక్‌లో నమోదైన 91,292 మంది డాటాను విశ్లేషించారు. క్యాన్సర్ మరణాలను అంచనా వేయడానికి వారిని సగటున 12.4 సంవత్సరాలపాటు పరిశోధకులు పరిశీలించారు. వీరి అధ్యయనం ప్రకారం, 30 నిమిషాలకుపైగా నిరంతరాయంగా కూర్చోవటం వల్ల క్యాన్సర్‌తో మరణించే ముప్పు 9శాతం అధికం. ప్రతిరోజూ ఒక గంట కూర్చోవటం కాకుండా తేలికపాటి శారీరక శ్రమతో గడిపితే.. మరణాలు 12శాతం తగ్గుతాయి. ఎక్కువసేపు కూర్చోవటం డయాబెటిస్, రక్తపోటు, గుండె జబ్బులబారిన పడే ముప్పును పెంచుతుందని ఇప్పటికే నిరూపితమైంది. క్రమం తప్పకుండా చిన్నపాటి కదలికలతో ఉన్న వ్యక్తుల్లో క్యాన్సర్ సంభవించటం, మరణాలు తక్కువగా ఉన్నాయని అధ్యయనం తేల్చింది.

## ఈరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియల్లో జనసంద్రం : శోకసముద్రమైన టెహ్రాన్ వీధులు



ఈరాన్ అత్యున్నత నాయకుడు (సుప్రీం లీడర్) అలీ ఖమేనీ అంతిమ యాత్రకు రాజధాని టెహ్రాన్ నగరం జన సంద్రంగా మారింది. లక్షలాది మంది ప్రజలు అశ్రునయనాలతో ఈ ఊరేగింపులో భాగమయ్యారు. నల్లటి వస్త్రాలు ధరించి, "మేము తిరగబడతాం" (We will rise) అన్న రౌద్ర నినాదాలతో కూడిన జెండాలను చేతబూని, రెవల్యూషన్ స్క్వేర్ నుండి అజాదీ స్క్వేర్ వరకు వీధులన్నింటినీ ముంచెత్తారు. ఇజ్రాయెల్ బాంబు దాడిలో ఆయన అమరుడైన తర్వాత, దేశవ్యాప్త సంఘీభావాన్ని, సమిష్టి ఆక్రోశాన్ని చాటిచెప్పేలా ఈ భారీ ప్రదర్శన సాగింది. రాజధాని నగరం నుండి పవిత్ర నగరాల వైపు సాగుతున్న ఈ బహుళ-రోజుల అంతిమ యాత్రకు దేశం నలుమూలల నుండి ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారు.

# నమాజ్
## జీవన క్రమశిక్షణ

**- యాసిర్**

**మానవ జీవితాన్ని క్రమశిక్షణతో ముడిపెడుతూ, సృష్టికర్తతో అనుసంధానించే అత్యున్నత ఆధ్యాత్మిక ఆరాధన 'నమాజ్' (సలాహ్). ఇస్లాం జీవన విధానంలో ఇది కేవలం శారీరక క్రియ కాదు; అంతరంగంలోని మాలిన్యాలను విముక్తం చేసే ఒక దివ్యమైన ప్రక్షాళన మార్గం. పవిత్ర ఖుర్ఆన్, హదీసుల వెలుగులో నమాజ్ అనేది విశ్వాసి ఆత్మను పరిపుష్టం చేసే అమృత వర్షిణి.**

నమాజ్ మనిషి హృదయంలో పేరుకుపోయే పాపాలను, కపటత్వాన్ని సమూలంగా తుడిచివేస్తుంది. ప్రవక్త ముహమ్మద్ (స) దీనిని ఒక అద్భుతమైన ఉపమానంతో వివరించారు. ఒక వ్యక్తి ఇంటి ముందు నిర్మలమైన కాలువ ప్రవహిస్తూ, అందులో అతడు రోజుకు ఐదుసార్లు స్నానమాచరిస్తే శరీరంపై ఎలాంటి మురికి మిగలదు. సరిగ్గా అలాగే, రోజుకు ఐదు పూటల నమాజ్ ఆచరించే విశ్వాసి జీవితంలో చిన్న చిన్న పాపాలు ఏవీ మిగలవని, అల్లాహ్ వాటిని పూర్తిగా క్షమించి వేస్తాడని హదీసు గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. శీతాకాలంలో చెట్టు కొమ్మను ఊపినప్పుడు ఆకులు రాలినట్లే, దైవ ప్రీతి కోసం నమాజ్ చదివినప్పుడు మానవుడి పాపాలు రాలి పోతాయి. అయితే, పెద్దపెద్ద మహాపాపాలు క్షమించ బడాలంటే హృదయపూర్వక పశ్చాత్తాపం (తౌబా) తప్పనిసరి.

### సమయపాలన

"అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైన కర్మ ఏది?" అన్న ప్రశ్నకు ప్రవక్త ఇచ్చిన సమాధానం-"సమయం కాగానే నమాజ్ చదవడం". దైవమార్గంలో పోరాడటం కంటే కూడా నమాజ్‌ను దాని నిర్ణీత వేళల్లో ఆచరించడానికే అత్యున్నత ప్రాధాన్యత ఉంది. సూర్యుని గమనాన్ని బట్టి ఐదు పూటల నమాజ్ వేళలు నిర్దేశించబడ్డాయి:

### క్రమశిక్షణ- ఏడేళ్ల నుంచే పునాది

పిల్లల వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు నమాజ్ ఒక గొప్ప సాధనం. పిల్లలకు 7 సంవత్సరాల వయస్సు రాగానే నమాజ్ చదవడం ప్రేమగా అలవాటు చేయాలి. 10 సంవత్సరాలు వచ్చినా అలసత్వం వహిస్తే మందలించైనా నిష్ఠను నేర్పాలి. అదే వయసులో వారి పడకలను కూడా వేరుగా ఏర్పాటు చేయాలనే మార్గదర్శకత్వం ఇస్లాంలో ఉంది.

### దైవ పిలుపు 'అజాన్'..

నమాజ్ సమయాన్ని ప్రకటించే 'అజాన్' పిలుపు వినబడగానే నకారాత్మక శక్తులు, షైతాన్ పలాయనం చిత్తు చేస్తాయి. భూమిపై దైవానికి అత్యంత ప్రీతికరమైన స్థలాలు మస్జిదులు. ప్రార్థనా స్థలాలలో వ్యాపారాలు చేయడం, బిగ్గరగా ప్రాపంచిక విషయాలు మాట్లాడటం నిషిద్ధం. నోటి దుర్వాసన కలిగించే పదార్థాలు తిని మస్జిద్‌లోకి రాకూడదు, ఎందుకంటే ఆ వాసన వల్ల తోటి వారికే కాక దైవదూతలకు కూడా ఇబ్బంది కలుగుతుంది.

### సామూహిక ప్రార్థనల విశిష్టత

ఇంటి వద్ద ఒంటరిగా చదివే నమాజ్ కంటే మస్జిద్‌లో జమాఅత్ (సామూహికంగా) చదివే నమాజుకు 27 రెట్లు అధిక పుణ్యం లభిస్తుంది. నమాజ్ కోసం మస్జిద్ వైపు వేసే ప్రతి అడుగుకు ఒక ఉన్నత స్థానం పెరిగి, ఒక పాపం తొలగి పోతుంది. మస్జిదులను కేవలం అందంగా అలంక రించడం కంటే, భక్తిశ్రద్ధలతో వాటిని సజీవంగా ఉంచడమే అసలైన విశ్వాస చిహ్నం. సామూహిక నమాజుల కొరకు నడవడం, కష్ట సమయాల్లోనూ పరిపూర్ణంగా పవిత్రత (వుజూ) పాటించడం, ఒక ప్రార్థన తర్వాత మరో ప్రార్థన కొరకు వేచి ఉండటం ఎంతో పుణ్యప్రదం.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2026-2028 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**